## నేటి కందం-నేటికి అందం

ముష్కర మూకలు చేసిన
దుష్కర్మల దిద్ది దిద్ది తులలేని గతిన్
పుష్కర కాలము మోడీ
నిష్కామిగ సేవల నిడె నిర్మము డగుచున్ !!

(భారత ప్రధాని గా నరేంద్ర మోడీ ప్రధాను లందరి కంటే ఎక్కువ కాలం సేవలు అందించి పుష్కర కాలంగా ప్రజలకు హితులుగా చరిత్రలో రికార్డు సృష్టించారని దేశీయులందరూ ప్రశంసిస్తున్నారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com    ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433    E-mail:netinijam93@gmail.com

చురక

వైఫల్యాల పెద్ద పుట్ట
విమర్శల మేటి దిట్ట
ఆదర్శాల నెహ్రూతో
ఆయనకింక పోలికెట్టా .
కాలంతో కొనసాగుడే
కాదుకదా మనిషి ఘనత
చేసినట్టి మంచిపనులే
చిరస్థాయి నిలుచు జనత



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శుక్రవారం 12-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:237 పేజీలు:6 వెల: రూ.1/-


## ఖమ్మం రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రతే లక్ష్యం: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, జూన్ 11: ఖమ్మం రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈరోజు(గురువారం) జలసౌధలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నీటిపారుదల ప్రాజెక్టులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. సీతమ్మసాగర్ సహా అన్ని ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేస్తామని వెల్లడించారు. ఖమ్మం జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. భూసేకరణ, అటవీ అనుమతులు, నిధుల సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని చెప్పారు.

సీతారామ ప్రాజెక్టు ఖమ్మం భవిష్యత్తును మార్చే ప్రాజెక్టు అని మంత్రి తెలిపారు. పాలేరు లింక్ కెనాల్ ద్వారా కొత్త ఆయకట్టుకు సాగునీరు, పాత ఆయకట్టుకు స్థిరీకరణ చేస్తామన్నారు. మున్నేరు - పాలేరు అనుసంధానం.. ఖమ్మం, సూర్యాపేట రైతులకు వరమన్నారు. విద్యుత్ ఖర్చు లేకుండా గ్రావిటీతో నీటిని మళ్లించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భద్రాచలం, ఖమ్మం వరద రక్షణ పనులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని.. ప్రతి ప్రాజెక్టుకు గడువులు నిర్దేశించి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

## తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లకు శాశ్వత భవనాలు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జూన్ 11: రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. గురువారం నాడు రెవెన్యూ, హౌసింగ్ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ప్రజలకు గౌరవప్రదమైన సేవలే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తొలి దశలో 125 తహసీల్దార్, 11 ఆర్డీవో కార్యాలయాలకు కొత్త భవనాలను నిర్మించనున్నట్లు చెప్పారు. ఆధునిక సౌకర్యాలతో ఒకే నమూనాలో కార్యాలయాల నిర్మాణం ఉంటుందన్నారు. అద్దె, శిథిలావస్థలో ఉన్న కార్యాలయాలకు శాశ్వత పరిష్కారం కల్పించనున్నట్లు చెప్పారు. నిర్మాణాల కోసం స్థలాల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి సూచనలతో తుది డిజైన్లకు రూపకల్పన చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కూడా ఆధునిక సమీకృత భవనాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఓఆర్ఆర్ పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. గచ్చిబౌలి, మేడ్చల్, పటాన్‌చెరు, కోహెడలో నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. గత ప్రభుత్వం ప్రణాళిక లేకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని విమర్శించారు. కొత్త మండలాలకు అవసరమైన పోస్టులను భర్తీ చేసి పరిపాలన బలోపేతం చేశామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం క్యూర్ పరిధిలో స్థలాల గుర్తింపు ప్రక్రియను ముమ్మరం చేయా లని అధికారులను పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.

## ఒమన్ తీరం వద్ద అమెరికా దాడి.. ముగ్గురు భారత నావికులు మృతి

న్యూ ఢిల్లీ, జూన్ 11:అమెరికా వైమానిక దాడిలో భారత్‌కు చెందిన ముగ్గురు నావికులు మృతిచెందారు. వాస్తవానికి గత వారం జరిగిన ఆ ఘటనలో ఆ నావికులు మిస్సైనట్లు భావించారు. కానీ ఒమన్ తీరంలో వాణిజ్య నౌకపై జరిగిన దాడిలో ఆ ముగ్గురు నౌకాదళ సిబ్బంది మృతిచెందినట్లు షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. ఎంటీ సిట్టిబెల్లో అనే నౌకలో మొత్తం 28 మంది సిబ్బంది ఉన్నారు. దీంట్లో 24 మంది భారతీయులే. విదేశీయుల్లో ఇద్దరు పాకిస్తానీలు, ఒకరు ఉక్రెయిన్ , రష్యా వ్యక్తి ఉన్నారు.

గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో ఆ నౌకపై అమెరికా దాడి చేసింది. మృతిచెందిన వారిని డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ , ఇంజిన్ ఫిట్టర్ శివానంద చౌరాసియా, చీఫ్ ఇంజినీర్ పట్నాలా సురేశ్‌గా గుర్తించారు. ఒమన్ తీరంలో వెళ్తున్న నౌకపై ప్రిసిషన్ మునిషన్ బాంబులతో సెంట్రల్ కమాండ్ దళాలు అటాక్ చేశాయి. ఇరాన్ సంక్షోభ వేళ ఆ నౌక ఆదేశాలను ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

అయితే ఐక్యరాజ్యసమితి వేదికగా ఆ దాడిని ఇండియా ఖండించింది. 24 మంది భారతీయులున్న నౌకపై అమెరికా నేవీ దాడి చేసిందన్నారు. హోర్ముజ్‌ను క్రాస్ చేస్తున్న సమయంలో ఈ ఘటన జరిగిందన్నారు. ఇరాన్ నుంచి ఇంధనం తీసుకెళ్తున్న వాణిజ్య నౌకపై తమ యుద్ధవిమానాలు దాడి చేసినట్లు సెంట్రల్ కమాండ్ చెప్పింది. ఆ ప్రమాదం ముగ్గురు నావికులు మృతిచెందడం దురదృష్టకరమని మంత్రి సోనోవాల్ తెలిపారు. తొలుత మిస్సైనట్లు భావించిన వారి దేహాలను గుర్తించినట్లు వెల్లడించారు. నౌకాదళ సిబ్బందికి ఇది తీరని లోటు అన్నారు.

# హైదరాబాద్‌కు ఐఐఎం కావాలి..
## -కేంద్రానికి సీఎం రేవంత్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ, జూన్ 11: దేశాభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈరోజు (గురువారం) ఢిల్లీలో జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. నీతి ఆయోగ్ వేదికగా కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. పైసలు, భూమి కంటే విద్యే సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా కులసర్వే వివరాలను ప్రస్తావించారు. దేశంలో ఏ రాష్ట్ర సీఎం, అధికారులైనా వచ్చి తెలంగాణలో తాము కడుతున్న 'యంగ్ ఇండియా స్కూల్స్' చూడాలని సూచించారు. సంతోషంగా తాము దగ్గరుండి చూపిస్తామని పేర్కొన్నారు.

**'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలి..**

దేశ ఆర్థికాభివృద్ధికి ఇంజినుగా ఉన్న టాప్-6 నగరాల కోసం రూ.6 లక్షల కోట్లతో 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని పీఎంవోకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దేశ అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధే.. విద్య, ఆరోగ్యమే దానికి బలమైన పునాది అని వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యం నెరవేరాలంటే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందాలని సూచించారు. తెలంగాణ కులసర్వేలో భూమి, డబ్బు కంటే విద్యే సామాజిక వెనుకబాటుకు కారణమని తేలిందని అన్నారు. కులాల మధ్య గోడలు కూల్చేందుకే ప్రతి నియోజకవర్గంలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు అందించేందుకే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ఏర్పాటు చేశామని ప్రస్తావించారు. స్కిల్స్ యూనివర్సిటీ నిర్వహణలో ఆనంద్ మహీంద్రా, శ్రీనిరాజు వంటి కార్పొరేట్ దిగ్గజాలు భాగస్వామ్యంగా ఉన్నాయని వెల్లడించారు.

**ఐటీఐలను ఆధునిక శిక్షణ కేంద్రాలుగా మారుస్తున్నాం..**

టాటా గ్రూప్ రూ.2,100 కోట్ల పెట్టుబడితో రాష్ట్రంలోని ఐటీఐలను ఆధునిక శిక్షణ కేంద్రాలుగా మారుస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'తెలంగాణ రైజింగ్' విజన్- 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్లు.. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యమని ఉద్ఘాటించారు. హైదరాబాద్‌కు ఐఐఎం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. తెలంగాణకు అంతర్జాతీయ వర్సిటీలు.. హైదరాబాద్‌లో 'యూనివర్సిటీ ఆఫ్ లండన్' ఆఫ్ షోర్ క్యాంపస్ ఏర్పాటు తొలి విజయమని చెప్పుకొచ్చారు. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధికి 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ 6 ప్రధాన నగరాల మౌలిక వసతుల కోసం ఒక్కో నగరానికి రూ.6 లక్షల కోట్ల ప్రత్యేక నిధి ఇవ్వాలని కోరారు. రీజినల్ రింగ్ రోడ్, మెట్రో ఫేజ్-2, మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీకి కేంద్రం సహకరించాలని సూచించారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం మద్దతు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ఇరాన్‌పై భీకర దాడులకు దిగిన అమెరికా సైన్యం.. హర్మూజ్‌ను క్లోజ్ చేసిన ఇరాన్



న్యూఢిల్లీ, జూన్ 11:పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికాకు చెందిన అపాచీ హెలికాప్టర్‌ను కూల్చివేసిన ఘటనకు ప్రతిస్పందనగా అమెరికా జరిపిన వైమానిక దాడుల తర్వాత ఇరాన్ గల్ఫ్ ప్రాంతంలో ప్రతీకార దాడులకు దిగింది. ఈ నేపథ్యంలో టెహ్రాన్‌ను లక్ష్యంగా చేసుకొని అమెరికా సైన్యం క్షిపణులు, డ్రోన్లతో ఇరాన్‌లోని కీలక లక్ష్యాపై భీకర దాడులు చేస్తోంది. ఇరాన్ దూకుడు చర్యలక సమాధానంగానే తాము దాడులు చేస్తున్నామని అమెరికా తెలిపింది.

ఈ దాడులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. హోర్ముజ్ జలసంధి ద్వారా 10 కోట్ల బ్యారెళ్ల చమురు తరలించామని తెలిపారు. హోర్ముజ్ ద్వారా 200 నౌకలు సురక్షితంగా తరలించామన్నారు. అమెరికా దాడుల నేపథ్యంలో హోర్ముజ్‌ను మూసివేస్తున్నట్లు ఇరాన్ వెల్లడించింది. హెచ్చరికలు పక్కనపెట్టి హోర్ముజ్ దాటితే దాడులు తప్పవని హెచ్చరించింది.

**ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తాం: ట్రంప్**

ఇరాన్‌పై తమ దాడులు కొనసాగిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. కువైట్, బహ్రెయిన్, జోర్డాన్‌ల్లోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇస్లామిక్ రిపబ్లిక్ దాడులు చేస్తున్న క్రమంలో ఇరాన్‌పై మరిన్ని దాడులకు సంసిదులవుతున్నట్టు చెప్పారు. ఈసారి విద్యుత్తు ప్లాంట్లు, వంతెనలను లక్ష్యంగా దాడులు చేయాలని ఆదేశించనున్నట్టు తెలిపారని ఫాక్స్ న్యూస్ వెల్లడించింది. తమకు చెందిన అపాచీ హెలికాప్టర్‌ను ఇరాన్ కూల్చివేసిన విషయాన్ని ట్రంప్ అంగీకరించారు. వార్తాపత్రిక చందా

దౌత్య చర్చల ప్రయత్నాలు కనుక నిలిచిపోతూనే ఉంటే సైనిక దాడులను మరింత ఉద్ధృతం చేస్తామని ఆయన తెలిపారు. వారు బతికి బట్టకట్టడానికి ఒప్పదంపై సంతకం చేసే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. ట్రంప్ తాజా వ్యాఖ్యలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉంది.

## 12 ఏళ్ల పాలనలో భారతదేశ దిశా దశ మార్చిన ప్రధాని మోదీ ....

**-వికసిత్ భారత్ , దేశ అభివృద్ధి , ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని మోదీ అడుగులు బిజెపి నేతలు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, చింతం శ్రీనివాస్..**





కరీంనగర్, జూన్ 11: (నేటినిజం ప్రతినిధి) 12 ఏళ్లలో భారతదేశ దిశ దశ ను మోడీ ప్రభుత్వం మార్చిందని , వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశాన్ని అన్ని రంగాలలో దూసుకుపోయే విధంగా తీర్చిదిద్ది , ప్రపంచంలోనే దేశానికి ఓ ప్రత్యేక గుర్తింపును తీసుకోచ్చిన ఘనత మోదికే దక్కుతుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, తిమ్మాపూర్ మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం కేంద్రంలో 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యంలో తిమ్మాపూర్ బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం రోజున నల్ల గొండలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారత్‌లో అత్యధిక కాలం నిరంతరంగా ప్రధాని పదవిలో కొనసాగిన నాయకుడిగా దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును నరేంద్ర మోదీ అధిగమించి సరికొత్త చరిత్ర సృష్టించారని , దేశాన్ని మరింత కాలం ప్రధాని మోదీ పరిపాలించడానికి , దేవుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని ప్రార్థిస్తూ తిమ్మాపూర్ బిజెపి శ్రేణులు మోడీ పేరిట ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, చింతం శ్రీనివాస్ లు మాట్లాడుతూ "ప్రజా సేవ అనేది సుపరిపాలనకు అతిపెద్ద పరీక్ష అని, వినయం, అంకితభావంతో పనిచేసే వ్యక్తి మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పొందగలుగుతారని, ప్రధాని మోదీ ఆ విశ్వాసాన్ని చురగొన్నారు కాబట్టే 12 ఏళ్లుగా దేశాన్ని విజయవంతంగా పరిపాలిస్తున్నారని తెలిపారు.గడిచిన 12 ఏళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మారాయన్నారు. 2014లో దాదాపు 2 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు 4 ట్రిలియన్ డాలర్ల మార్కును దాటేసిందన్నారు. ప్రపంచంలోనే ఐదవ ఆర్థిక శక్తిగా అవతరించిందన్నారు. ముఖ్యంగా 'యూపీఐ' ద్వారా దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. రికార్డు స్థాయిలో జాతీయ రహదారుల నిర్మాణం, బ్రాడ్-గేజ్ రైల్వే లైన్ల విద్యుదీకరణ (99% పైగా),వందే భారత్ రైళు ,ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని కీలక సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందించడం, దశాబ్దాలుగా దేశాన్ని పట్టిపీడిస్తున్న అనేక సమస్యలకు ముగింపు పలకడం, చారిత్రక బిల్లులకు పరిష్కారం చూపెట్టింది మోదీ ప్రభుత్వమేనన్నారు. ఈ ప్రోగ్రాంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర ,తిమ్మాపూర్ మండల బిజెపి నాయకులు గొట్టిముక్కల తిరుపతిరెడ్డి,బోనాల మోహన్,కనుగంటి మధుకర్ రెడ్డి, గడ్డం అరుణ్ ,బుర్ర శ్రీనివా సగౌడ్, రాఘవరెడ్డ, వేల్పుల ఓదలు యాదవ్, జాడి రాజు, దోనపాటి ప్రదీప్ రెడ్డి, కామోర వెంకటేష్,గట్ట రాజు చింతం సు మన్, బాలగోని వెంకటేశ్,కాల్వ శ్రీనివాస్ ,జంగ సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల కోసం ప్రత్యేక ప్రణాళికతో వెళ్తున్నాం: మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, జూన్ 11: రాబోయే 2027 గోదావరి పుష్కరాల కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. నాలుగు జిల్లా కేంద్రాలకు ఫోర్‌లైన్స్ రోడ్డు ఉన్న హుస్నాబాద్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నామని.. డ్రైనేజీ సిస్టమ్ అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈరోజు (గురువారం) హుస్నాబాద్ బస్టాండ్‌ని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడి బస్సుల వివరాలు, మౌలిక సదుపాయాలు గురించి అడిగి మంత్రి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. పెరుగుతున్న పట్టణానికి అనుగుణంగా ఇంజినీరింగ్ కాలేజీ, టూరిజం, మెడికల్ కాలేజీ ఇండస్ట్రియల్ కారిడార్ ద్వారా అభివృద్ధి జరుగుతుందని వివరించారు. ప్రయాణికుల సంఖ్య.. బస్టాండ్ రెవెన్యూ పరంగా ముందుందని తెలిపారు. ప్రతిరోజూ 35 వేల మంది ప్రయాణికులు ఇక్కడి నుంచి వెళ్తుంటారని చెప్పుకొచ్చారు. హుస్నాబాద్ బస్టాండ్‌ని పెద్ద షాపింగ్ మాల్‌గా అభివృద్ధి చేస్తామని.. మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## బీజేపీ వినాశకర రాజకీయాలు చేస్తోంది.. మహేశ్ గౌడ్ ధ్వజం



న్యూఢిల్లీ, జూన్ 11:ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో దేశంలో సామాన్యుడికి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని తెలంగాణ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ నిత్యవసరాల ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ధ్వజమెత్తారు. గృహిణులను ఇబ్బంది పెట్టేలా ఎల్పీజీ గ్యాస్ ధరలు పెరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. ఈరోజు (గురువారం) ఢిల్లీ వేదికగా మహేశ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు.

దేశవ్యాప్తంగా జాతీయస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై ఏఐసీసీ సమావేశంలో చర్చించామని మహేశ్ గౌడ్ తెలిపారు. తెలంగాణలో ఎక్కడా మీనాక్షి నటరాజన్‌పై కేసు నమోదు కాలేదని స్పష్టం చేశారు. రాజకీయ కక్షతో ఉద్దేశపూర్వకంగా మహిళా అని కూడా చూడకుండా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని ఆగ్రహించారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు.. దేశ చరిత్రలో ఇలా ఎప్పుడు జరగలేదని చెప్పుకొచ్చారు. బీజేపీ వినాశకర రాజకీయాలు చేస్తోందని మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు.




ఆహ్వానం
కిన్నెర ఆర్ట్ థియేటర్స్
శ్రీ త్యాగరాయగాన సభ
సంయుక్త ఆధ్వర్యంలో
సాహిత్య సవ్యసాచి, విమర్శన కళాప్రవీణ
డా॥ ద్వానా శాస్త్రి గారి
79వ జయంతి సందర్భంగా
అధ్యక్షులు, తెలుగు రథం
శ్రీ కొంపెల్ల శర్మగారికి
కిన్నెర-ద్వానాశాస్త్రి స్మారక పురస్కారం-బహూకరణ



డా॥ ద్వానా శాస్త్రి రచించిన
తెలుగు సాహిత్యంలో హాస్యామృతం
(ద్వితీయ ముద్రణ) ఆవిష్కరణ





సోమవారం 15-6-2026, సా॥ 6 గంటలకు
కళా సుబ్బారావు కళావేదిక,
శ్రీ త్యాగరాయగాన సభ, హైదరాబాదు

ముఖ్యఅతిథి : డా॥ కె.వి.రమణ, ఐఎఎస్ (రి) పూర్వ సలహాదారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
అధ్యక్షులు : శ్రీ జి. వల్లీశ్వర్, కార్యవర్గ, పాలకవర్గ సభ్యులు నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా (GoI)
విశిష్ట అతిథి : శ్రీ కళా జనార్దనమూర్తి అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ
గౌరవ అతిథులు : శ్రీ బైస దేవదాసు, 'నేటి నిజం' సంపాదకులు
శ్రీమతి శైలజామిత్ర, ప్రముఖ రచయిత్రి
ఆత్మీయ అతిథి : శ్రీ ద్వాదశి శశికాంత్, ద్వానా శాస్త్రి కుమారుడు

డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి) అధ్యక్షులు, కిన్నెర
మద్దాళి రఘురామ్ కార్యదర్శి, కిన్నెర
శ్రీమతి కళా శారద కార్యదర్శి, శ్రీ త్యాగరాయగానసభ

# బాలకార్మిక వ్యవస్థకు అడ్డుకట్ట వేయలేమా !

## (12 జూన్ "ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం" సందర్భంగా)

అంతర్జాతీయ కార్మిక సంస్థ నిర్వచనం ప్రకారం, బాలల్ని ఉపాధులు లేదా ఉద్యోగాల ఉచ్చులో బంధించి వారి బాల్యాన్ని, శక్తియుక్తులను, గౌరవాన్ని, సంపూర్ణ ఎదుగుదలను, శారీరక మానసిక ఆరోగ్యాన్ని హరింపజేసే లేదా నలిపి వేసే ప్రయత్నాలను బాల కార్మిక వ్యవస్థ అని అంటాం. అంతర్జాతీయ, జాతీయ చట్టాలు, నియమనిబంధనలకు వ్యతిరేకంగా పిల్లలను (5 నుంచి 17 ఏండ్ల లోపు) కార్మికులుగా మార్చి వారి బంగారు భవితను బుగ్గిపాలు చేయడాన్ని బాల కార్మిక దురాచారం అని అర్థం చేసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా నేటికీ 160 మిలియన్ల బాల కార్మికుల బతుకులు ఉపాధుల పేరుతో బుగ్గిపాలు అవుతున్నాయి. వీరిలో వయస్సు 5 - 11 ఏండ్ల లోపు ఉన్న బాలలు 48 శాతం, 12 - 14 ఏండ్ల వారు 28 శాతం, 15 - 17 ఏండ్ల లోపు పిల్లలు 24 శాతం ఉండడం గమనించారు. ఆఫ్రికాలో 20 శాతం బాలలు, ఏసియా పసిపిక్‌లో 7 శాతం, అమెరికన్లు 11 శాతం, యూరోప్-సెంట్రల్ ఆసియాలో 4 శాతం, అరబ్ ప్రాంతాల్లో 3 శాతం బాల కార్మికులు నమోదు అవుతున్నారు. ప్రపంచ బాల కార్మికుల్లో దాదాపు 56 శాతం మధ్య ఆదాయ దేశాల్లోనే ఉండడం ఆశ్చర్యంగా ఉన్నది.

భారతంలో బాల కార్మిక దురాచారం:

బాల కార్మిక వ్యవస్థను రూపు మాపడంలో భారత్ కొంత ప్రగతిని సాధించినప్పటికీ మరింత దృష్టిని కేంద్రీకరించవలసిన అవసరం ఏర్పడుతున్నది. 2011 వివరాల ప్రకారం, 5 - 14 ఏండ్ల లోపు బాల కార్మికులు 43.53 లక్షల ఉన్నారని, 2001లో వీరి సంఖ్య 1.26 కోట్లు ఉండేదని గమనించాలి. పేదరికం, నిరక్షరాస్యత, సామాజిక-ఆర్థిక సమస్యలతో బాల కార్మిక వ్యవస్థ ప్రధానంగా ముడిపడి ఉంటుంది. భారత బాల కార్మికులు అధికంగా వ్యవసాయం, నిర్మాణ రంగం, ఇటుక బట్టీలు, బాణాసంచా తయారీ కేంద్రాలు, కార్పెట్ పరిశ్రమ, మైనింగ్, రెస్టారెంట్లు లాంటి రంగాల్లో మగ్గుతున్నారు. భారత రాజ్యాంగం ప్రకారం 14 ఏండ్ల లోపు పిల్లలను చట్టవ్యతిరేకంగా పనిలో పెట్టుకోవడం లేదా ప్రమాదకర పరిస్థితుల్లో బతుకులను గడపడం చట్టవ్యతిరేకమని తెలుపుతున్నది. బాల కార్మిక దురాచారాన్ని రూపుమాపడానికి 1986 బాల కార్మిక చట్టం, 2017 బాల కార్మిక చట్ట సవరణ, 1987లో బాల కార్మికుల జాతీయ పాలసీ లాంటివని తేవడం, అమలు పరచడం జరుగుతున్నది.

ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం-2026:

ఐరాస-అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్ఓ)-యూనిసెఫ్ సంయుక్త చొరవతో ప్రతి ఏట 12 జూన్న "ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం ( వరల్డ్ డే అగెనిస్ట్ చైల్డ్ లేబర్)"ను పాటించడం ఆనవాయితీగా మారింది. ఈ వేదికగా బాల కార్మిక దురాచారాన్ని కట్టడి చేయడం, అవగాహన కల్పించడం, కఠినంగా చట్టాలు అమలు చేయడం, బాలలకు/ కుటుంబాలకు సరైన సహాయాలు అందించడం లాంటివి జరుగుతున్నాయి. 2026 ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం ఇతివృత్తంగా "బాలకార్మిక వ్యవస్థకు రెడ్ కార్పెట్ : బాలలకు న్యాయమైన ఆట, పెద్దలకు గౌరవప్రదమైన పని" అనబడే అంశాన్ని తీసుకున్నారు. బాలలు చదువుకోవడం, ఆడు కోవడం, సురక్షిత బాల్యం కొనసాగడానికి మాత్రమే అవకాశం కల్పించాలని కుటుంబ పెద్దలు తెలుసుకోవాలి. పిల్లల శ్రమను దోపిడీ చేయడం, చిన్నారి చేతులకు/దేహానికి/ మనస్సుకు గాయాలు చేయడం, బాలల బంగారు భవిష్యత్తును ఆదిలోనే తుంచేయడం అమానవీయం, ఆక్షేపణీయం అని నినదించాలి.

బాల కార్మిక దురాచార నిర్మూలనకు సవాళ్లు:

బాల కార్మిక దురాచార నిర్మూలనకు సవాళ్లుగా పేదరికం, నిరక్షరాస్యత, తల్లితండ్రుల నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందులు, విద్యకు దూరంగా ఉండడం, సామాజిక కట్టుబాట్లు, చట్టాల అమలులో నిర్లక్ష్యం, సామాజిక అంగీకారం, ప్రలోభ యాజమాన్యాలు, అవగాహన లోపం, పౌర సమాజ నిశ్శబ్దం లాంటివి అడ్డుగా నిలుస్తున్నాయి. బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడానికి తీసుకోవలసా చర్యల్లో పేదరిక నిర్మూలన, తల్లితండ్రులకు ఉద్యోగ ఉపాధుల కల్పన, పాఠశాలల అందుబాటు, అక్షరాస్యత/అవగాహన పెంచడం, సామాజిక భద్రత కల్పించడం, ప్రభుత్వాలు/పౌర సమాజం/అంతర్జాతీయ సంస్థల సమైక్య కృషి, విద్యపై పెట్టుబడులు పెంచడం, నైపుణ్యాల వృద్ధి, వయోజనులకు ఉద్యోగ కల్పన లాంటివి నిత్యం కొనసాగాలి.

బాలల ఆరోగ్య సంరక్షణ, పిల్లల గౌరవాన్ని కాపాడడం, విద్య అవకాశాలు కల్పన, ఆటపాటల కొనసాగింపుకు గట్టి కృషి జరగాలి. ప్రమాదకర పరిస్థితుల్లో పని చేస్తున్న బాలల మనసులకు పడుతున్న తూట్లు, విరుగుతున్న ఎముకలు, శ్వాస ఇబ్బందులు, శారీరక గాయాలు, విష రసాయనాల దుష్ప్రభావాలు, ఆందోళనలు, మానసిక ఒత్తిడి, భావోద్వేగ సమస్యలు, సామాజిక-శారీరక-మానసిక ఎదుగుదల సమస్యలు, చిన్నారుల శ్రమ దోపిడీ లాంటివి బాల్యాన్ని చిదిమేయడం నేటి డిజిటల్ యుగంలో సహితం జరగడం సోచనీయం. ఇప్పటికైనా బాల కార్మిక దురాచారాన్ని ప్రపంచం నుంచి పాతాళానికి తరిమేద్దాం, బాలలకు పూర్తి స్వేచ్ఛనిద్దాం.



-మధుపాళీ
9949700037

# విలువను పెంచడం, సుస్థిరత, మార్కెట్ అవకాశాల విస్తృతిపై ప్రధానంగా చర్చ

న్యూఢిల్లీ, జూన్ 11:మత్స్య శాఖ, ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ (ఎంఓ ఎఫ్‌పీఐ) ల సహకారంతో.. కేంద్ర వాణిజ్యం - పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని వాణిజ్య విభాగం 2026 జూన్ 5-6 తేదీల్లో విశాఖపట్నంలో సముద్ర ఆహార ఎగుమతులపై రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్‌ను నిర్వహించింది. సముద్ర ఆహారోత్పత్తుల విలువను పెంచడం, సుస్థిరత, మార్కెట్ అవకాశాలను విస్తరించుకోవడం, ఆవిష్కరణలు - మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా.. దేశ సముద్ర ఆహారోత్పత్తుల ఎగుమతులను మరింత పెంచడంపై విస్తృత చర్చలకు ఈ సదస్సు వేదికగా నిలిచింది.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర వాణిజ్య - పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్, కేంద్ర మత్స్య- పశు సంవర్ధక - పాడిపరిశ్రమ - పంచాయతీ రాజ్ శాఖల మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కింజరపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ చిరాగ్ పాశ్వాన్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

సదస్సుద్దేశించి శ్రీ పీయూష్ గోయల్ ప్రసంగిస్తూ.. సముద్ర ఆహారోత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించడంలో అనుసరిస్తున్న ఏకోన్ముఖ ప్రభుత్వ విధానాన్ని వివరించారు. గత దశాబ్ద కాలంలో భారత సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల విలువ దాదాపు 70 శాతం పెరిగిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ సముద్ర ఆహార వాణిజ్యంలో భారత్ వాటా దాదాపు 4 శాతంగా ఉందన్నారు. విలువను పెంచే చర్యలు, బ్రాండింగ్, నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచడం, సుస్థిరత, ఎగుమతి మార్కెట్ల విస్తరణ ద్వారా.. వచ్చే అయిదేళ్లలో సముద్ర ఆహార ఎగుమతులను 30 బిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా సంబంధిత భాగస్వాములంతా సమష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

సముద్ర ఆహారోత్పత్తుల విలువను పెంచేలా.. నేరుగా తినేందుకు (రెడీ టు ఈట్), నేరుగా వండుకునేందుకు (రెడీ టు కుక్) వీలుగా ఉండే ఉత్పత్తుల వాటాను పెంచాల్సిన ఆవశ్యకత ఉందని మంత్రి అన్నారు. 38 దేశాలతో భారత్ ఇటీవల కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా లభించే అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలను ఎగుమతిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అత్యంత నాణ్యమైన, పర్యావరణ సుస్థిరత కలిగిన సముద్ర ఆహారోత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా భారత్‌ను ఒక నమ్మకమైన కేంద్రంగా నిలపాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

మత్స్య పరిశ్రమ, ఆక్వాకల్చర్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందనీ, దేశ సముద్ర ఆహారోత్పత్తుల ఎగుమతులకు రాష్ట్రం గణనీయమైన సహకారాన్ని అందిస్తోందని శ్రీ నారా చంద్రబాబు నాయుడు వివరించారు. ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, బ్రాండింగ్, భాగస్వాములందరి సమిష్టి కృషితో.. సుస్థిర ఆక్వాకల్చర్, సముద్ర ఆహారోత్పత్తుల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పునరుద్ఘాటించారు.

దేశ మత్స్య రంగంలో నమోదైన అసాధారణ వృద్ధిని శ్రీ రాజీవ్ రంజన్ సింగ్ వివరించారు. దేశంలో చేపల ఉత్పత్తి 2012-13లో 95.8 లక్షల టన్నులుగా ఉండగా.. 2024-25 నాటికి దాదాపు 198 లక్షల టన్నులకు పెరిగిందని ఆయన వెల్లడించారు. అంతర్జాతీయంగా ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ దేశ సముద్ర ఆహారోత్పత్తుల ఎగుమతులు దాదాపు రూ. 73,890 కోట్లకు (8.46 బిలియన్ డాలర్లు) చేరాయనీ, దేశీయ ఆహారోరత్పత్తుల ఎగుమతుల్లో ఘనీభవింపజేసిన రొయ్యలు (ఫ్రోజెన్ ష్రింప్) ప్రధాన ఉత్పత్తిగా కొనసాగుతోందని ఆయన తెలిపారు. ఎగుమతులకు అనుకూలమైన మత్స్య రంగ మౌలిక సదుపాయాలు, చేపలున్న ప్రదేశాలను గుర్తించడం, సముద్ర ఆహారోత్పత్తుల విలువను పెంచడం, సుస్థిర ఆక్వాకల్చర్‌ను బలోపేతం చేయడం లక్ష్యంగా పీఎంఎంఎస్‌వై, పీఎంకేఎస్‌ఎస్‌వై 2.0 కింద ప్రభుత్వ కృషిని ఆయన ఈ సందర్భంగా వివరించారు.

విలువైన సముద్ర ఆహారోత్పత్తుల ఎగుమతుల్లో సమర్థమైన వస్తురవాణా, కార్గో మౌలిక సదుపాయాల ప్రాధాన్యాన్ని మంత్రి శ్రీ కింజరపు రామ్మోహన్ నాయుడు వివరించారు. కార్గో మౌలిక సదుపాయాల బలోపేతం, వివిధ రకాల రవాణా వ్యవస్థల అనుసంధానాన్ని మెరుగుపరచడం, ఎగుమతుల్లో దేశం మరింత సమర్థంగా పోటీపడేలా తీర్చిదిద్దే దిశగా కార్గో రవాణాను క్రమబద్ధీకరించే దిశగా ప్రభుత్వ కృషిని ఆయన వివరించారు.

సముద్ర ఆహార రంగంలో ఉత్పత్తుల విలువను పెంచేందుకు విస్తృతమైన అవకాశాలున్నాయని శ్రీ చిరాగ్ పాశ్వాన్ పేర్కొన్నారు. ప్రాసెసింగ్, బ్రాండింగ్, సాంకేతికతను అందిపుచ్చుకోవడం, మార్కెట్ విస్తరణపై ప్రధానంగా దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. 'పరిమాణం నుంచి విలువ' దిశగా, 'ముడి సరుకుల ఉత్పత్తి నుంచి తుది ఉత్పత్తి'ని అందించే దిశగా ముందుకు సాగాల్సిన ఆవశ్యకత ఉందని వ్యాఖ్యానించారు. తద్వారా ఆహారోత్పత్తుల నమ్మకమైన అంతర్జాతీయ సరఫరాదారుగా భారత్ స్థానాన్ని బలోపేతం చేయాలన్నారు.

మత్స్యశాఖ కార్యదర్శి డాక్టర్ అభిలాక్ష లిఖి మాట్లాడుతూ.. దేశ సముద్ర ఆహారోత్పత్తి వ్యవస్థను బలోపేతం చేసేందుకు భాగస్వామ్య పక్షాలన్నింటి మధ్య సమన్వయంతో కూడిన కృషి అత్యావశ్యకమన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, ధ్రువీకరణ, ఆవిష్కరణ, ఉత్పత్తుల విలువను పెంచడం, ఈ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా మార్కెట్ లభ్యతను మెరుగుపరచడం వంటి అంశాలు అత్యంత కీలకమైనవన్నారు.

కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఉన్నతాధికారులతోపాటు.. ఎంపీఈడీఏ, ఈఐసీ, ఎన్ఎఫ్‌డీబీ, నాబార్డ్, ఎన్‌సీడీసీ, ఎన్‌సీఈఎల్, ఎస్ఎఫ్ఏసీ వంటి కీలక సంస్థల ప్రతినిధులను ఈ సదస్సులో ఒకే వేదికపైకి తెచ్చింది. వీరితోపాటు సముద్ర ఆహారోత్పత్తుల ఎగుమతిదారులు, ప్రాసెసర్లు, పారిశ్రామిక సంఘాలు, అంకుర సంస్థలు, పరిశోధకులు, ఆక్వాకల్చర్ రైతులు, సముద్ర ఆహారోత్పత్తులకు సంబంధించి ప్రతి దశకూ చెందిన ఇతర క్షేత్రస్థాయి భాగస్వాములు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహయోజన (పీఎంకేఎస్ఎస్‌వై), కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ), ఇతర ప్రభుత్వ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనాలను కూడా ఈ కార్యక్రమంలో అందించారు.

మత్స్య రంగానికి సంబంధించి ప్రతీదశలో ఎదురవుతున్న పలు కీలక సవాళ్లపై ముఖాముఖిలో భాగంగా చర్చించారు. వ్యాధి నివారణ చర్యలు, పెరుగుతున్న పెట్టుబడి వ్యయం, చేపల మేత లభ్యత, నాణ్యమైన విత్తనాలు, సంతానోత్పత్తి రకాల లభ్యత, క్వారంటైన్ మౌలిక సదుపాయాలు, రవాణా, నియంత్రిత శీతల రవాణా వ్యవస్థ (కోల్డ్ చైన్) అభివృద్ధి, ధ్రువీకరణ నిబంధనలు, చేపలు ఎక్కువగా ఉన్న ప్రదేశాలను గుర్తించడం, సుస్థిరతా ప్రమాణాల వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. వీటితోపాటు ఉత్పత్తుల విలువను పెంచడం, ఎగుమతి మార్కెట్ల విస్తరణ, అంకుర సంస్థలూ, ఎంఎస్ఎంఈలకు చేయూత, సుస్థిర చేపల పెంపకం పద్ధతులను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందని ప్రతినిధులు ప్రముఖంగా ప్రస్తావించారు.

చేపలు ఎక్కువగా ఉన్న ప్రదేశాలను గుర్తించే (ట్రేసబిలిటీ) పద్ధతులు, సుస్థిరతా ధ్రువీకరణ, ఉత్పత్తుల విలువను పెంచడం, ఎగుమతులకు ప్రోత్సాహం, డీప్ సీ ఫిషరీస్, ఎగుమతి అవకాశాల విసస్తరణ, సముద్ర ఆహార రంగంలో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) విధానం అమలుకు అవకాశాలపై వరుసగా సాంకేతిక సదస్సులను ఈ రెండు రోజుల వర్క్‌షాప్‌లో భాగంగా నిర్వహించనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నడుచుకోవడాన్ని బలోపేతం చేయడం, ప్రాసెసింగ్ - కోల్డ్ చైన్ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, అంకుర సంస్థలూ, ఎంఎస్ఎంఈలకు చేయూతనివ్వడం, దేశ సముద్ర ఆహారోత్పత్తులకు మార్కెట్ లభ్యతను మెరుగుపరచడం వంటి అంశాలపై నిపుణులు, భాగస్వాములు చర్చించారు.

దేశ ప్రత్యేక ఆర్థిక మండలి పరిధిలో ఉన్న, ఇప్పటివరకు ప్రాదేశిక స్థాయిలో వినియోగించుకోని అగాధ సముద్ర వనరుల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంపై కూడా ఈ చర్చల్లో ప్రధానంగా దృష్టి సారించారు. ముఖ్యంగా అండమాన్ - నికోబార్ దీవులు, లక్షద్వీప్‌లలోని వనరుల వినియోగంతోపాటు.. సముద్ర శైవలాలు, ఆర్నమెంటల్ ఫిషరీస్, కోల్డ్ వాటర్ ఫిషరీస్, జెల్ల చేపల పెంపకం వంటి వర్ధమాన రంగాలపైనా ఈ సదస్సులో విస్తృతంగా చర్చించారు.

సముద్ర ఆహారోత్పత్తుల రంగంలో ఆవిష్కరణలు, వ్యవస్థాపకత, వైవిధ్యీకరణను ప్రోత్సహిస్తూ.. పర్యావరణ సుస్థిరత, ఉత్పత్తి మూలాల గుర్తింపు, విలువ పెంపు, ఎగుమతి మౌలిక సదుపాయాలు, మార్కెట్ అవకాశాలను మరింత బలోపేతం చేయాలన్న భాగస్వామ్య పక్షాల సమష్టి సంకల్పంతో ఈ సదస్సు ముగిసింది. సముద్ర ఆహారోత్పత్తుల ఎగుమతిలో అంతర్జాతీయంగా భారత్ పోటీతత్వాన్ని పెంపొందించడం, వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని మరింత పురోగమింపజేసే దిశగా ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనలో ఈ చర్చల్లో చేసిన సిఫార్సులు ఎంతగానో దోహదపడతాయి.

# ఒమన్ సమీపంలో వాణిజ్య నౌకపై దాడి అనంతరం భారత తీరరక్షక దళం - ఒమన్ అధికారుల సమన్వయ చర్యలు

న్యూఢిల్లీ, జూన్ 11:పలావు పతాకంతో ప్రయాణిస్తున్న 'ఎంటీ మారివెక్స్' అనే ట్యాంకరుపై జరిగిన క్షిపణి దాడికి సంబంధించి భారత తీర రక్షక దళానికి చెందిన నౌకావాణిజ్య సమన్వయ కేంద్రం (ఎంఆర్‌సీసీ)- ముంబయికి సమాచారం అందింది. ఒమన్‌లోని మసిరా వద్ద లంగరు వేసి ఉన్న ఈ నౌకలో 24 మంది భారతీయ సిబ్బంది ఉన్నారు. 2026 జూన్ 8న దాదాపు 1420 గంటల సమయంలో ఈ దాడి జరిగినట్లు తెలిసింది. సమాచారం అందిన వెంటనే.. ఒమన్ మేరిటైమ్ సెర్చ్ అండ్ రెస్క్యూ సెంటర్ (ఓఎంఎస్సీ)తో ముంబయి ఎంఆర్‌సీసీ విభాగం సంప్రదింపులు చేపట్టింది. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడంతోపాటు, సిబ్బంది భద్రత కోసం ఓఎంఎస్సీ, సంబంధిత ఇతర వర్గాలతో నిరంతర సమన్వయాన్ని కొనసాగించింది. అనంతరం సుమారు 1700 గంటల సమయంలో... నౌకలోని 24 మంది భారతీయ సిబ్బందిని ఒమన్ నావికాదళ హెలికాప్టర్ల ద్వారా సురక్షితంగా రక్షించినట్లు ఒమన్ ఓఎంఎస్సీ ధ్రువీకరించింది. రక్షించిన సిబ్బంది అంతా క్షేమంగా ఉన్నారని, ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం గానీ, గాయాలు గానీ కాలేదని తెలిపింది. ప్రస్తుతం ఆ నౌక ఒమన్‌లోని మసిరా వద్దే ఉంది.

అంతర్జాతీయ నౌకావాణిజ్య సహకారంలో భారత్ సమర్థతకు ఈ విజయవంతమైన రక్షణ ఆపరేషన్ నిదర్శనం. అలాగే ఈ ప్రాంతంలోని సముద్ర రక్షణ సంస్థల మధ్య పటిష్టమైన సమన్వయ యంత్రాంగాన్ని మరోసారి స్పష్టం చేసింది. సముద్రయాన సమయాల్లో... అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో సాయాన్ని అందించడంతోపాటు, భారతీయ నావికుల రక్షణకు ఎల్లవేళలా కట్టుబడి ఉంటామన్న భారత తీరరక్షక దళ నిబద్ధతను ఇది చాటుతోంది.

# ఖరీఫ్ సాగుకు పటిష్ట చర్యలు

## -అధికారులు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ నాగరాణి




అమరావతి, జూన్ 11: జిల్లాలో ఖరీఫ్-2026 పంట సాగుకు రైతులకు అవసరమైన సాగునీటిని ఎటువంటి ఆటంకాలు లేకుండా అందించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా నీటిపారుదల సలహా మండలి చైర్‌పర్సన్ చదలవాడ నాగరాణి ఆదేశించారు.

భీమవరం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన జిల్లా నీటిపారుదల సలహా మండలి ఖరీఫ్ 2026-27 సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. సమావేశానికి భీమవరం ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ, రైతులకు సాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఇటీవల ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజల స్పందన ఆధారంగా నీటిపారుదల శాఖకు రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం రావడం గర్వకారణమన్నారు. ఇందుకు కృషి చేసిన అధికారులను అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు.

కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు పనుల పురోగతిపై ఇరిగేషన్ సర్కిల్ వారీగా సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ముఖ్యంగా షట్టర్ల మరమ్మతులను అత్యవసరంగా చేపట్టాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే ప్రధాన, ఉప కాలువలను నీటి ప్రవాహానికి సిద్ధంగా ఉంచాలని సూచించారు.

జిల్లాలో 18 ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు గుర్రపు డెక్కతో కంపోస్టు తయారీ చేపట్టడం రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కేంద్రాలను నీటిపారుదల శాఖ అధికారులు సందర్శించి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

మున్సిపల్ డ్రైనేజీ నీరు, ఇతర వ్యర్థాలు పంట కాలువల్లో కలవకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలుష్య నియంత్రణ కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ, రైతులకు నిరంతర సాగునీటి సరఫరా కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్య అంశమని చెప్పారు. మున్సిపల్ డ్రైనేజీ నీటిని నేరుగా పంట కాలువల్లోకి వదలడం ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు.

దీని వల్ల తాగునీటి వనరులు, పర్యావరణం కలుషితమవడంతో ప్రజలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. డెల్టా ప్రాంతంలో కాలుష్య ప్రభావం తీవ్రంగా కనిపిస్తోందని, దీనిపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

తాగునీటి వనరుల పరిరక్షణ, పర్యావరణ కాలుష్య నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, పంట కాలువల్లోకి డ్రైనేజీ నీరు చేరకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

సమావేశంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కె. మురళీకృష్ణరాజు, వైస్ చైర్మన్ గుబ్బల మార్రాజు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, సాగునీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

అలాగే నీటిపారుదల శాఖ ఎస్ఈ దేవ ప్రకాష్, ఈఈ యు. రమేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, నరసాపురం సబ్ డివిజన్ డీఈ సీహెచ్ వెంకటనారాయణ, తణుకు సబ్ డివిజన్ డీఈ శ్రీనివాస్, తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ డీఈ కె. ధర్మజ్యోతి, భీమవరం డ్రైన్స్ ఈఈ సత్యనారాయణ, జేఈలు, ఏఈలు తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆహ్వానం

తెలుగు శాఖ, డా. ఎస్.ఆర్.కె. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, యానాం
కవిసంధ్య - సాహిత్య సాంస్కృతిక సంస్థ, యానాం
సంయుక్త నిర్వహణ లో

కవిత్వ శిక్షణా శిబిరం
National Poetry Workshop

కవి సంధ్య
60వ ప్రత్యేక సంచిక
ఆవిష్కరణ



13-14 జూన్ 2026, శనివారం, ఆదివారం
ఉదయం 9.30 గం॥లకు

డా.ఎల్.ఆర్.స్వామి ప్రాంగణం
డా.ఏటుకూరి ప్రసాద్ వేదిక
సెమినార్ హాలు, డా.ఎస్.ఆర్.కె. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, యానాం

డా.వరుగు భాస్కర్ రెడ్డి
సదస్సు సంచాలకులు,
ప్రిన్సిపాల్, డా.ఎస్.ఆర్.కె.ఆర్ట్స్ కళాశాల, యానాం.
9440127967

డా.శిఖామణి
అధ్యక్షులు, కవి సంధ్య
9848202526

నాల్గవ సదస్సు
14.6.2026, ఆదివారం ఉదయం 10.00 నుండి 1.00 వరకు
డా.ఆర్.సీతారాం
అంశం : కవిత్వం - రచనా వ్యూహాలు
శ్రీ నామాడి శ్రీధర్
అంశం : కవిత్వం - అపురూపత
డా.సుంకర గోపాల్
అంశం : కవిత్వం - వస్తువు
సమన్వయ కర్త : డా.శిఖామణి
భోజనవిరామం : 1.30 నుండి 2.00 వరకు

అయిదవ సదస్సు
2.00 నుండి 4.00 వరకు
డా.ఎల్.కె. సుధాకర్
అంశం : కవిత్వం - అనువాదం
శ్రీ దాట్ల దేవదానం రాజు
అంశం : కవిత్వం - అనుభవం
డా.శిఖామణి
అంశం : కవిత్వం : రచనా పద్ధతులు
సమన్వయ కర్త : శ్రీ అవధానుల మణిబాబు

4.00.గం.లకు
సమాపన సదస్సు
ముఖ్య అతిథి : శ్రీ దాట్ల దేవదానం రాజు
అధ్యక్షులు : డా.వరుగు భాస్కర్ రెడ్డి, ప్రిన్సిపాల్
సమాపన ప్రసంగం : డా.శిఖామణి

కవుల స్పందన - సర్టిఫికెట్స్ బహూకరణ
వందన సమర్పణ : డా. జె.చంద్రశేఖరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్, జువాలజీ

# భారతదేశంలో క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి బ్రిస్టల్, యార్క్, న్యూ సౌత్ వేల్స్ విశ్వవిద్యాలయాలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ సమక్షంలో అనుమతి పత్రాల అందజేత

న్యూఢిల్లీ, జూన్ 11:ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన మూడు విదేశీ ఉన్నత విద్యా సంస్థలైన బ్రిస్టల్ విశ్వవిద్యాలయం, యార్క్ విశ్వవిద్యాలయం, న్యూ సౌత్ వేల్స్ విశ్వవిద్యాలయాలకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఈ రోజు మూడు అనుమతి పత్రాలను (ఎల్ఓఏ) జారీ చేసింది.

కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ సమక్షంలో ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి- విశ్వవిద్యాలయ నిధుల కమిషన్ (యూజీసీ) ఛైర్మన్ డాక్టర్ వినీత్ జోషి ఈ అనుమతి పత్రాలను ఆయా సంస్థల ప్రతినిధులకు అందజేశారు.

బ్రిస్టల్ విశ్వవిద్యాలయం కార్యనిర్వాహక డీన్- డైరెక్టర్ శ్రీమతి మిషెల్ జోన్స్, యార్క్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ చార్లీ జెఫరీ, న్యూ సౌత్ వేల్స్ విశ్వవిద్యాలయం డిప్యూటీ ఉపకులపతి (ఎడ్యుకేషన్ అండ్ స్టూడెంట్ ఎక్స్‌పీరియన్స్) ప్రొఫెసర్ సారా మాడిసన్ స్వయంగా ఈ అనుమతి పత్రాలను (ఎల్ఓఏ) అందుకున్నారు.

ఈ కార్యక్రమంలో బ్రిటిష్ హైకమిషన్, ఆస్ట్రేలియన్ హైకమిషన్, బ్రిటిష్ కౌన్సిల్, విద్యా మంత్రిత్వ శాఖ, విశ్వవిద్యాలయ నిధుల కమిషన్ (యూజీసీ) ప్రతినిధులతో పాటు ఆయా మూడు విశ్వవిద్యాలయాల ప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. బ్రిస్టల్ విశ్వవిద్యాలయం, యార్క్ విశ్వవిద్యాలయం, న్యూ సౌత్ వేల్స్ విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడం.. 'విద్య అంతర్జాతీయకరణ' అనే జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 దార్శనికతను ముందుకు తీసుకెళ్లడంలో మరొక ముఖ్యమైన ఘట్టం అని అన్నారు. ఈ విద్యా సంస్థలు భారత్‌లో నాణ్యమైన విద్యను, ప్రపంచ స్థాయి అభ్యాస భాగస్వామ్యాలను, పరిశోధనా సహకారాలను మరింత బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. బ్రిస్టల్, యార్క్ విశ్వవిద్యాలయాలు ముంబయిలో.. యూఎన్ఎస్‌డబ్ల్యూ బెంగళూరులో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేస్తుండటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. భారత్‌లో విజ్ఞాన, సాంకేతిక, ఆవిష్కరణల కేంద్రాలుగా విరాజిల్లుతున్న నగరాల్లో ఈ విశ్వవిద్యాలయాలు కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయని, అందులోనూ బెంగళూరు తూర్పు దేశాల్లో 'కొత్త సిలికాన్ వ్యాలీ'గా గుర్తింపు పొందిందని ఆయన గుర్తు చేశారు. ఈ మూడు విశ్వవిద్యాలయాలకు దేశంలోకి ఘన స్వాగతం పలుకుతున్నట్లు ఆయన తెలిపారు. భారత్‌లో వేగంగా విస్తరిస్తున్న ప్రపంచ ఉన్నత విద్యా వ్యవస్థలో భాగమైనందుకు వాటికి అభినందనలు తెలిపారు.

బ్రిస్టల్ విశ్వవిద్యాలయం ముంబయిలో తన 'ముంబయి ఎంటర్‌ప్రైజ్ క్యాంపస్'ను ఏర్పాటు చేయనుంది. ఇందులో ఇమ్మర్సివ్ ఆర్ట్స్, ఫైనాన్స్, డేటా సైన్స్, ఆర్థిక శాస్త్రం, బిజినెస్ మేనేజ్‌మెంట్, వ్యవస్థాపకత, ఆవిష్కరణలు వంటి రంగాలలో కోర్సులను అందించాలని ప్రతిపాదించారు.

యార్క్ విశ్వవిద్యాలయం ముంబయిలో తన మొట్టమొదటి విదేశీ క్యాంపస్‌ను స్థాపించనుంది. ఇక్కడ ఫైనాన్స్, కృత్రిమ మేధతో కంప్యూటర్ సైన్స్, సైబర్ సెక్యూరిటీ, బిజినెస్, ఎకనామిక్స్, సృజనాత్మక పరిశ్రమలు, మేనేజ్‌మెంట్ వంటి విభాగాలలో కోర్సులను అందించాలని ప్రతిపాదించారు.

న్యూ సౌత్ వేల్స్ విశ్వవిద్యాలయం బెంగళూరులోని మాన్యతా బిజినెస్ పార్క్‌లో 'యూఎన్ఎస్‌డబ్ల్యూ బెంగళూరు' క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. ఇది 2026 ఆగస్టు నుంచి ప్రారంభం కావడానికి సిద్ధంగా ఉంది. ఈ క్యాంపస్ బిజినెస్, కంప్యూటర్ సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాలలో కోర్సులను అందించడమే కాకుండా పునరుత్పాదక ఇంధనం, ఆరోగ్యం, రవాణా, విద్యా రంగాలలో భారత్‌తో మరింత లోతైన భాగస్వామ్యానికి దోహదపడుతుంది.

ఈ క్యాంపస్‌ల ఏర్పాటు అనేది జాతీయ విద్యా విధానం 2020 పరిధిలోని విస్తృత అంతర్జాతీయకరణ ఎజెండాలో ఒక భాగం. ఈ విధానం ఉన్నత విద్యా ప్రమాణాలలో అత్యున్నత ప్రపంచ స్థాయి నాణ్యతను సాధించడంపై, భారతదేశాన్ని ఒక అంతర్జాతీయ విద్యా గమ్యస్థానంగా తీర్చిదిద్దడంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది.

భారత్‌లో విదేశీ ఉన్నత విద్యా సంస్థల క్యాంపస్‌ల ఏర్పాటు, నిర్వహణకు సంబంధించిన యూజీసీ నిబంధనలు... ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సంస్థలు తమ సంస్థాగత స్వయంప్రతిపత్తిని, ప్రపంచ స్థాయి ప్రమాణాలను కాపాడుకుంటూనే దేశంలో క్యాంపస్‌లను ఏర్పాటుచేయటానికి ఒక పారదర్శకమైన, సులభతరమైన, కాలపరిమితితో కూడిన విధివిధానాలను అందిస్తున్నాయి.

ఈ క్యాంపస్‌లు భారత్‌లోనే ఉన్నత ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ విద్యను అందుబాటులోకి తెస్తాయని, ఉభయ దేశాల మధ్య విద్యాసంబంధిత రాకపోకలను ప్రోత్సహిస్తాయని, పరిశోధన- ఆవిష్కరణలను బలోపేతం చేస్తాయని భావిస్తున్నారు. ఇవి భారతీయ విద్యార్థులకు కొత్త అవకాశాలను సృష్టించడంతో పాటు బ్రిటన్, ఆస్ట్రేలియాలతో భారతదేశ విద్యా భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తాయి.

ఈ కార్యక్రమం భారతదేశ నియంత్రణ, విద్యా వ్యవస్థపై ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థలకు పెరుగుతున్న నమ్మకాన్ని తెలియజేస్తోంది. ఇది ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వం ఉన్న, అందరికీ సమాన అవకాశాలు కల్పించే, భవిష్యత్తు అవసరాలకు తగినట్లుగా ఉండే ఉన్నత విద్యా రంగాన్ని సృష్టించడంలో తోడ్పడుతుంది.

నేడు బ్రిస్టల్ విశ్వవిద్యాలయం, యార్క్ విశ్వవిద్యాలయం, న్యూ సౌత్ వేల్స్ విశ్వవిద్యాలయాలకు అనుమతి పత్రాల (ఎల్ఓఏ) అందజేతతో కలిపి ఇప్పటి వరకు మొత్తం ఐదు అనుమతి పత్రాలు జారీ అయ్యాయి. విదేశీ ఉన్నత విద్యా సంస్థల కోసం తీసుకొచ్చిన యూజీసీ నిబంధనల ప్రకారం వీటిని అందించారు. వీటిలో గతంలో అనుమతి పొందిన సౌతాంప్టన్ విశ్వవిద్యాలయం, లివర్‌పూల్ విశ్వవిద్యాలయం కూడా ఉన్నాయి. సౌతాంప్టన్ విశ్వవిద్యాలయం ఇప్పటికే 2025?26 విద్యా సంవత్సరం నుంచి తన విద్యా సంబంధిత కార్యకలాపాలను ప్రారంభించింది. భారతదేశమంతటా తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయటం కోసం బ్రిటన్, అమెరికా, ఆస్ట్రేలియా, ఇటలీ వంటి దేశాలకు చెందిన మరికొన్ని ప్రపంచ ప్రఖ్యాత విదేశీ ఉన్నత విద్యా సంస్థలకు యూజీసీ ఇప్పటికే 10 ఉద్దేశ పత్రాలను (లెటర్ ఆఫ్ ఇంటెంట్) జారీ చేసింది. ఇవి కాకుండా డీకిన్ విశ్వవిద్యాలయం, వోలోంగాంగ్ విశ్వవిద్యాలయం, క్వీన్స్ యూనివర్సిటీ- బెల్ ఫాస్ట్ సంస్థలు ఇప్పటికే గిఫ్ట్ సిటీలో తమ కార్యకలాపాలను ప్రారంభించాయి.

# అమృత్ 2.0 పనులను వేగవంతం చేయాలి

-ఎమ్మెల్యే గడ్డం వినోద్, అదనపు కలెక్టర్ చంద్రయ్య

-బెల్లంపల్లి మున్సిపాలిటీలో తాగునీటి అభివృద్ధి పనుల క్షేత్రస్థాయి పరిశీలన



నల్గొండ, జూన్ 11:బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో 'అమృత్ 2.0' పథకం కింద చేపడుతున్న తాగునీటి సరఫరా, మౌలిక వసతుల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, అదనపు కలెక్టర్ చంద్రయ్య గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న పైప్‌లైన్ నిర్మాణం, ఓవర్ హెడ్ రిజర్వాయర్ పనుల పురోగతిని వారు నిశితంగా సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు పనుల ప్రస్తుత స్థితి, పూర్తి కావలసిన గడువుపై సమగ్ర నివేదికను సమర్పించారు.

అనంతరం ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ.. అమృత్ 2.0 పథకం ద్వారా పట్టణ ప్రజలందరికీ మెరుగైన తాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ చంద్రయ్య మాట్లాడుతూ పనుల అమలులో పారదర్శకత, వేగం పెంచాలని సూచించారు. ఈ తనిఖీల్లో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, డీఈలు, ఏఈలు, కాంగ్రెస్ లీడర్లు కారుక్కారి రాంచందర్, బండి ప్రభాకర్ యాదవ్, చిలుముల శంకర్, దావా రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్వీఎం, ఎయిమ్స్ ఆస్పత్రులకు బస్సు సర్వీసులు ప్రారంభించాలి

-మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు బీజేపీ వినతిపత్రం

మేడ్చల్,జూన్ 11: వంటమామిడిలోని ఆర్వీఎం ఆస్పత్రి, బీబీనగర్‌లోని ఎయిమ్స్ ఆస్పత్రులకు మేడ్చల్ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని కోరుతూ బీజేపీ నాయకులు గురువారం మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మేడ్చల్ పరిసర ప్రాంతాల ప్రజలు అత్యవసర వైద్య సేవల కోసం నిత్యం ఆర్వీఎం, ఎయిమ్స్ ఆస్పత్రులకు పెద్ద సంఖ్యలో వెళ్తున్నారని తెలిపారు.

అయితే ఈ మార్గాల్లో తగిన బస్సు సౌకర్యం లేకపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి అదనపు ఆర్థిక భారం భరించాల్సి వస్తోందని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందించే ఈ రెండు ఆస్పత్రులకు నేరుగా బస్సు సర్వీసులు ఏర్పాటు చేయడం అత్యవసరమని వారు అభిప్రాయపడ్డారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యపై డిపో మేనేజర్ స్పందించిన తీరుపై బీజేపీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.




# స్థానిక సంస్థల్లో బీసీలకు జనాభా నిష్పత్తి మేర రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి

-ప్రత్యేక కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించిన ఘంటా పద్మశ్రీప్రసాద్



ఏలూరు జూన్ 11: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతులకు (బీసీలు) వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ కోరారు.

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై అధ్యయనం చేస్తున్న ప్రత్యేక కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు గురువారం ఆమె వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఘంటా పద్మశ్రీప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్ర జనాభాలో బీసీలు గణనీయమైన శాతం కలిగి ఉండటమే కాకుండా వ్యవసాయం, సంప్రదాయ వృత్తులు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, వ్యాపారం, సేవారంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ రాజకీయ, సామాజిక రంగాల్లో తగిన ప్రాతినిధ్యం పొందలేకపోతున్నారని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించి సుప్రీంకోర్టు నిర్దేశించిన "ట్రిపుల్ టెస్ట్'' ప్రక్రియను కేవలం విధానపరమైన అంశంగా కాకుండా, బీసీల సామాజిక న్యాయం, రాజకీయ సాధికారతను బలోపేతం చేసే సాధనంగా ఉపయోగించాలని సూచించారు.

కమిషన్ పరిశీలన కోసం పలు సూచనలను ఆమె ప్రతిపాదించారు. బీసీల జనాభా శాతానికి అనుగుణంగా స్థానిక సంస్థల్లో రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఇందుకోసం శాస్త్రీయ డేటాతో పాటు సామాజిక, విద్యా, ఆర్థిక, రాజకీయ వెనుకబాటుతనాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

జిల్లాల వారీగా, స్థానిక సంస్థల వారీగా బీసీ వర్గాలపై సమగ్ర అధ్యయనం నిర్వహించి, జనాభాతో పాటు విద్యా స్థితి, ఆర్థిక పరిస్థితులు, సంప్రదాయ వృత్తులు, అవకాశాల ప్రాప్తి, వాస్తవ రాజకీయ ప్రాతినిధ్యాన్ని పరిశీలించాలని కోరారు.

సామాజిక, విద్యా వెనుకబాటుతనంతో పాటు రాజకీయ ప్రాతినిధ్యం లోపాన్ని కూడా ప్రత్యేక ప్రమాణంగా పరిగణించాలని, బీసీలకు తగిన అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

స్థానిక సంస్థలు, కార్పొరేషన్లు, కమిటీలు, ఇతర ప్రజా సంస్థల్లో ఎన్నికైన, నామినేటెడ్ పదవుల్లో బీసీలకు సముచిత వాటా కల్పించేలా కమిషన్ సిఫార్సులు చేయాలని కోరారు.

రాజకీయ అవకాశాలకు ఇంకా దూరంగా ఉన్న అత్యంత వెనుకబడిన బీసీ ఉపవర్గాలను గుర్తించి, వారికి ప్రత్యేక అవకాశాలు కల్పించే చర్యలను సూచించాలని అభ్యర్థించారు. అలాగే బీసీ మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంపొందించే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు.

బీసీ వర్గాలకు సంబంధించిన ఖచ్చితమైన, శాస్త్రీయ, పారదర్శక డేటా ఆధారంగా నివేదిక రూపొందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజకీయ సాధికారత లక్ష్యాల సాధనకు అనుగుణంగా కమిషన్ సిఫార్సులు ఉండాలని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాలు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర నివేదిక రూపొందించాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు జనాభా నిష్పత్తి మేర రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా సామాజిక న్యాయం బలోపేతం అవుతుందని, స్థానిక స్వపరిపాలన వ్యవస్థలు మరింత ప్రజాస్వామ్యబద్ధంగా మారుతాయని ఘంటా పద్మశ్రీప్రసాద్ పేర్కొన్నారు.

# అహమదాబాద్‌లో "విలువను రాబట్టడం" అంశంపై ప్రాంతీయ ఉన్నత స్థాయి విధాన చర్చా కార్యక్రమం

న్యూఢిల్లీ, జూన్ 11:కేంద్ర ప్రభుత్వ ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ (ఎమ్ఓఎఫ్‌పీఐ), ప్రపంచ బ్యాంకు గ్రూపు నాయకత్వంలోని 'శాప్లింగ్' కార్యక్రమం సహకారంతో 2026 జూన్ 9న గుజరాత్.. అహమదాబాద్‌లో ప్రాంతీయ ఉన్నత స్థాయి విధాన చర్చా కార్యక్రమాన్ని ప్రారంభించింది. "విలువను రాబట్టడం: దక్షిణాసియాలో ఉపాధి అవకాశాల కల్పనతో పాటు దీర్ఘకాలిక అభివృద్ధి కోసం ఆహార శుద్ధిని ముందుకు తీసుకుపోవడం" అంశాన్ని ఈ కార్యక్రమానికి శీర్షికగా నిర్దేశించారు.

రెండు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రాంతీయ చర్చా కార్యక్రమంలో సుమారు 200 మంది పాల్గొంటున్నారు. వారిలో విధాన రూపకర్తలు, పరిశ్రమ ప్రముఖులు, అభివృద్ధి భాగస్వాములు, నూతన ఆవిష్కర్తలు, పరిశోధకులు, అంకుర సంస్థలు, దక్షిణాసియా దేశాల ప్రతినిధులు ఉన్నారు. వీరు దక్షిణాసియాలో ఆహార శుద్ధి విస్తారిత అనుబంధ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు దృఢతర, సమ్మిళిత, దీర్ఘకాల ప్రాతిపదిక కలిగిన ఆహార వ్యవస్థలను తీర్చిదిద్దే పద్ధతులపై చర్చిస్తారు.

తొలి రోజు సమావేశాన్ని ఉద్దేశించి కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ చిరాగ్ పాస్వాన్ ప్రసంగిస్తూ, ప్రపంచ ఆహార శుద్ధి కేంద్రంగా భారత్ పాత్ర నానాటికీ పెరుగుతోందన్నారు. దక్షిణాసియాలో ఆహార సంబంధిత ఆర్థిక వ్యవస్థ రూపురేఖలను మార్చడానికి విలువ జోడింపు, సాంకేతికతను స్వీకరించడం, ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించుకోవడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు.

వ్యవసాయానికి, సమృద్ధి సాధనకు మధ్య ఒక వారధిగా ఆహార శుద్ధి నిలుస్తోందని, ఈ రంగంలో ఉపాధి కల్పన , పంట కోతల అనంతర నష్టాల తగ్గింపు, రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు ఆహార భద్రతను బలోపేతం చేసేందుకు అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి శ్రీ చిరాగ్ పాస్వాన్ అన్నారు. ప్రపంచ స్థాయిలో పోటీపడగలిగిన ఫూడ్ వేల్యూ చైన్లను ఏర్పాటు చేయడంలో భారత్ అమలుచేస్తున్న విధానపరమైన కార్యక్రమాలూ, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంబంధిత ప్రయత్నాలూ తోడ్పడుతున్నాయని వివరించారు.

గుజరాత్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ జీతూభాయి వాఘానీ మాట్లాడుతూ, వేరువేరు దేశాల నుంచి పలువురు ఈ 'శాప్లింగ్- 2026' చరిత్రాత్మక కార్యక్రమంలో పాలుపంచుకోవడాన్ని ప్రశంసించారు. వ్యవసాయ పరివర్తనకు చోదకశక్తిగా ఆహార శుద్ధి రంగం నిలుస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఉపాధికల్పనలో, విలువ పెంపులో, ఆర్థిక వ్యవస్థ సమగ్రాభివృద్ధికి ఊతాన్ని అందించడంలో వ్యవసాయ- పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహాన్ని ఇవ్వడానికి గుజరాత్ ప్రభుత్వం కట్టుబడి ఉందని శ్రీ వాఘానీ తెలిపారు. ఈ ఆశయాన్ని ముందుకు తీసుకుపోవడానికి, వ్యవసాయానికీ పరిశ్రమ రంగానికీ మధ్య ఉన్న అంతరాన్ని భర్తీ చేయడానికీ గుజరాత్‌లో జాతీయ ఆహార శుద్ధి, ఔత్సాహిక పారిశ్రామికత్వం, నిర్వహణల సంస్థ క్యాంపసును ఏర్పాటు చేయాలని ఆయన సూచన చేశారు.

మొదటి రోజు సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న వారిలో ప్రపంచ బ్యాంకులో భారత్ తరఫు కార్యనిర్వాహక కంట్రీ డైరెక్టరు శ్రీ పాల్ ప్రోసీ, గేట్స్ ఫౌండేషన్‌లో భారత్ తరఫు కంట్రీ డైరెక్టరు అర్చనా వ్యాస్, ఎమ్ఓఎఫ్‌పీఐ కార్యదర్శి శ్రీ అవినాశ్ జోషీతో పాటు అనేక సీనియర్ ఉన్నతాధికారులు ఉన్నారు.

ఈ చర్చలో కింద ప్రస్తావించిన ఇతివృత్తాలపై కార్యక్రమాలు భాగంగా ఉంటాయి:

పెద్ద పెద్ద ఆలోచనలు చేయడం, స్థానిక స్థాయిలో పనులు పూర్తి చేయడం: దక్షిణాసియాలో ఆహార శుద్ధికి గల అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం.

పొలం నుంచి కర్మాగారం దిశగా పయనించడం: ఆహార శుద్ధిని దృష్టిలో పెట్టుకొని వ్యావసాయిక సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడం.

నీడలో నుంచి వెలుగు వైపునకు: అనధికారిక ఆహార శుద్ధి సంస్థలకు అధికారిక గుర్తింపును ఇవ్వడం (చిన్న శుద్ధిసంస్థలను నియంత్రణకు లోబడే వేల్యూ చైన్ల పరిధిలోకి చేర్చడం).

స్మార్ట్ టెక్, సాహసిక నూతన ఆవిష్కరణలు: సాంకేతికత సాయంతో ఆహార శుద్ధి ప్రక్రియల్లో పరివర్తన.

సురక్షిత ఆహారం, బలమైన మార్కెట్లు: ఆరోగ్యం, నాణ్యతతో పాటు పోటీతత్వంతో కూడిన వాణిజ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రమాణాలను నిర్దేశించడం.

సాగు, సంస్థ, ఆర్థిక సహాయం: ఆహార శుద్ధి రంగ అభివృద్ధి కోసం పెట్టుబడి సమీకరణ.

ఉమ్మడి ఆహార రంగ భవిష్యత్తుకు రూపురేఖలను తీర్చిదిద్దడం: దక్షిణాసియాలో ప్రాంతీయ సహకారంతో పాటు విధాన సంబంధిత కార్యాచరణ.

ఈ చర్చలలో నెస్లే, బాయర్, రాబోబ్యాంకు, అజినోమోటో, ఐటీసీ, సేవా, నాబార్డ్‌లతోపాటు ఫూడ్ ఇండస్ట్రీ ఏషియా సహా ప్రముఖ భారతీయ సంస్థల, ప్రపంచ సంస్థల సీనియర్ ప్రతినిధులు పాలుపంచుకొంటున్నారు.

ఒక నూతన ఆవిష్కరణ మేళాను కూడా ఈ చర్చా కార్యక్రమంతో పాటు నిర్వహిస్తున్నారు. కోల్డ్ చైన్ లాజిస్టిక్స్, డిజిటల్ ట్రేసబులిటీ, మన్నికైన ప్యాకేజింగ్, స్మార్ట్ ప్రాసెసింగుకు సంబంధించిన సాంకేతికతలు, నిల్వ వ్యవస్థల్లో ఇంతవరకూ ఎరుగని సేవలను ఈ మేళాలో ప్రదర్శిస్తున్నారు.

నూతన ఆవిష్కర్తలు, విధాన రూపకర్తలతో పాటు పరిశ్రమకు చెందిన ఆసక్తిదారుల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం ఈ మేళా లక్ష్యం.

ఈ సందర్భంగా, "భారత్‌లో ఆహార శుద్ధి స్థాయి నిర్ధారణ" శీర్షికతో ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నివేదికను మంత్రులు, ప్రముఖులు ఆవిష్కరించారు.

ఈ నివేదికలో ప్రధాన వ్యావసాయిక ఉత్పాదనలలో ఆహార శుద్ధి స్థాయిల విస్తృత నిర్ధారణను ప్రస్తావించారు. అలాగే భారత్ ఆహార శుద్ధి రంగంలో చోటు చేసుకున్న కీలక ప్రగతిని కూడా పొందుపరిచారు. దీనిలో 2016లో ఇంచుమించు 10 శాతంగా ఉన్న మొత్తంమీద శుద్ధి స్థాయిలు, 2023కల్లా వృద్ధి చెంది.. దాదాపు 17 శాతానికి చేరాయని పేర్కొన్నారు. పండ్లు, కాయగూరలు, పాడి ల వంటి త్వరగా చెడిపోయే ఉత్పాదనలకు విలువను జోడించడానికి ఉన్న కీలక అవకాశాలను ఈ అధ్యయనంలో గుర్తించారు. ఈ నివేదిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు, పంట కోతల తరువాత జరిగే నష్టాన్ని తగ్గించేందుకు, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, ఆహార సంబంధిత ఆర్థిక వ్యవస్థలో భారత్ ప్రపంచ దేశాలతో పోటీ పడటాన్ని ప్రోత్సహించడానికి విధానపరంగా అనుసరించదగ్గ వ్యూహాత్మక సిఫారసులను కూడా అందించింది.

ప్రపంచ బ్యాంక్ గ్రూపునకు చెందిన అగ్రికనెక్ట్ కార్యక్రమం, శాప్లింగ్ వేదికకు అనుగుణంగా ప్రాంతీయ ఉన్నత స్థాయి విధాన చర్చ 'శాప్లింగ్' కార్యక్రమాన్ని రూపొందించారు. విధానపరమైన సంస్కరణ, పెట్టుబడి సమీకరణ, సాంకేతికత ఆధారిత పరిష్కారాలను అమల్లోకి తీసకువస్తూ దక్షిణాసియాలో దృఢతర, పోషణ ప్రధాన ఆహార వ్యవస్థలకు వేగాన్ని సంతరించడం ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశం.

ఈ చర్చా కార్యక్రమ నిర్వహణతో దేశాల మధ్య జ్ఞానాన్ని పెంచుకొనే ప్రక్రియ జోరందుకొనేటట్లు చూడడం, ప్రాంతీయ సహకారాన్ని పటిష్టపరచడం, ప్రయివేటు రంగ పెట్టుబడిని ప్రోత్సహించడం, ఎమ్ఎస్ఎమ్ఈలకు మద్దతును అందించడంతో పాటు, దక్షిణాసియాలో ఆహార శుద్ధి ఆధారిత అభివృద్ధిని, ఉపాధి అవకాశాల కల్పనను ప్రోత్సహించడానికి ఆచరణయోగ్య పద్ధతులను కూడా గుర్తించవచ్చన్న అంచనాలు ఏర్పడ్డాయి.

## చెన్నూరులో తెలంగాణ రక్షణ సమితి ఆరంభం..

ఆదిలాబాద్, జూన్ 11 :చెన్నూరు నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ రక్షణ సమితి పార్టీ కార్యకలాపాలు ఆ పార్టీ నాయకులు ప్రారంభించారు.

టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గ్రామా గ్రామానా తెలంగాణ రక్షణ సమితి జెండా అనే పిలుపుమేరకు నాయకులు చెన్నూరు పట్టణంలో పార్టీ జండాను ఆవిష్కరించి ప్రధాన విధులలో జై టీఆర్ఎస్, తెలంగాణ రక్షణ సమితి జిందాబాద్ అంటూ భారీ ర్యాలీ నిర్వహించారు.

# శాస్త్రీయ దృక్పథం ద్వారానే సమాజంలో మార్పు

**-పాలమూరు యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. బైరెడ్డి సతీష్ రెడ్డి**




ఆదిలాబాద్, జూన్ 11: మూఢత్వంతో కూడినఅంధ విశ్వాసాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని దీంతో విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకత ఆలోచన దెబ్బతింటుందని పాలమూరు యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, డా. బైరెడ్డి సతీష్ రెడ్డి అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని బిజ్వార్ లో

పి.డి.ఎస్.యు. తెలంగాణ రాష్ట్ర విద్యా- వైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం ద్వారానే సమాజంలో మార్పు సాధించవచ్చఅన్నారు.

సమాజాన్ని పట్టిపీడిస్తున్న కులమత ఆర్థిక అసమా నతలు దోపిడి పీడన లాంటి రుగ్మతలు పోవాలంటే నేటి విద్యార్థి, యువత శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని అన్నారు. పి.డి.ఎస్.యుతెలంగాణ రాష్ట్ర విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులు జూన్ 11 నుండి 14 వరకు నిర్వహిస్తున్నామన్నారు.

క్లాసుల ప్రారంభానికి ముందు పి.డి.ఎస్.యు. బిగిపిడికిలి జెండాను రాష్ట్ర అధ్యక్షులు కాంపాటీ పృథ్వి ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థి అమరవీరులను స్మరిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబోలా అఈ సందర్భంగా టిపిటిఎఫ్ పూర్వ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ ప్రారంభోపన్యాసం చేయగా, సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ నారాయణపేట జిల్లా కార్యదర్శి బి.రాము మాట్లాడారు. దేశంలోని పౌరులందరూ భౌతిక వాద దృక్పథాన్ని కలిగి ఉండాలని, ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. మూఢత్వంతో కూడిన అంధ విశ్వాసాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, లేకపోతే విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకత, ఆలోచన శక్తి దెబ్బతింటుందని, ఇది భవిష్యత్తులో దేశ అభివృద్ధికి అవరోధంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

రచన ఎలా చేయాలి-ఉపన్యాసం ఎలా ఇవ్వాలి" అనే క్లాసును మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రమ బోధించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు, మునిగల శివప్రశాంత్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు సురేష్, కర్క గణేష్, బోయినపల్లి అజయ్, రాష్ట్ర కోశాధికారి అంగిడి కుమార్, రాష్ట్ర గర్ల్స్ కో-కన్వీనర్ పి. అనూష, రాష్ట్ర నాయకులు సీతారాం, అనిల్, మారుతి, లక్ష్మణ్, అషూర్, హరీష్, మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారుల నిర్వహణ బలోపేతం కోసం అధునాతన సాంకేతికతలను వినియోగించనున్న ఎన్‌హెచ్ఏఐ

న్యూఢిల్లీ, జూన్ 11:యాంత్రిక, ఆటోమేటెడ్ వ్యవస్థల దిశగా ఒక ముఖ్యమైన మార్పుతో జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల వ్యాప్తంగా నిర్వహణ పద్ధతులను బలోపేతం చేయడం లక్ష్యంగా ఎన్‌హెచ్ఏఐ సాంకేతికత ఆధారిత కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. ఈ చర్యల్లో భాగంగా పట్టణ, జనసాంద్రత అధికంగా గల ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థల యాంత్రిక నిర్వహణకు... ఆటోమేటిక్ విధానంలో గుంతలను పూడ్చడం, కుదింపు - ప్యాచింగ్ యంత్రాలు, రహదారులను శుభ్రపరిచే యంత్రాలు సహా అధునాతన యాంత్రిక రహదారి నిర్వహణ పరికరాల వినియోగానికి ఎన్‌హెచ్ఏఐ సమగ్ర మార్గదర్శకాలను జారీ చేసింది.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగించడం... నివారణాత్మక నిర్వహణ పద్ధతులను, ఒప్పంద బాధ్యతలను మరింత కఠినంగా అమలు చేయడం ద్వారా జాతీయ రహదారుల నిర్వహణలో సామర్థ్యాన్నీ, నాణ్యతనూ మెరుగుపరచడమే ఈ కార్యక్రమాల లక్ష్యం. ఈ చర్యలు నాణ్యతను మెరుగుపరుస్తాయి. సుస్థిరతను బలోపేతం చేస్తాయి. జాతీయ రహదారి వినియోగదారుల ప్రయాణ అనుభవాన్నీ మెరుగుపరుస్తాయి.

# గిరిజన గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

**-ఎమ్మెల్యే వెదమ బొజ్జు**

నల్గొండ, జూన్ 11:కడెం మండలంలోని అల్లంపల్లి?బాబా నాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామా



ల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెదమ బొజ్జు పటేల్, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా హామీ ఇచ్చారు.

గురువారం అల్లంపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజా సమావేశంలో ఎమ్మెల్యే, కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బొబడే, డీఆర్డీఓ విజయ లక్ష్మి, డీపీఓ శ్రీనివాస్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గ్రామస్థులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అల్లంపల్లి గ్రామానికి మంజూరైన రహదారి అటవీ శాఖ అనుమతుల లేమితో నిర్మాణం ప్రారంభం కాలేదని, దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ఇప్పించాలని కోరారు.

అలాగే, ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అటవీ శాఖ అధికారులు అడ్డంకులు సృష్టిస్తున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కూడా కోరారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెదమ బొజ్జు పటేల్, కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ, అల్లంపల్లి గ్రామానికి కొత్త రహదారి మంజూరు చేయడంతో పాటు అటవీ శాఖ నుంచి అవసరమైన అనుమతులు పొందేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కూడా అనుమతులు కల్పించే దిశగా కృషి చేస్తామని చెప్పారు. హెల్త్ సబ్ సెంటర్ ఏర్పాటు కోసం కూడా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

అల్లంపల్లి, బాబా నాయక్ తండా తదితర గ్రామాల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు, అటవీ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. భూ పట్టాలకు సంబంధించిన ఫిర్యాదులపై ప్రత్యేక విచారణ జరిపించి, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఏఎంసీ చైర్మన్ పి. భూషణ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి పి. సతీష్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొడ్డు గంగన్న, తహసీల్దార్ కాజా మొయినుద్దీన్, ఎంపీడీవో అరుణ, ఉడుంపూర్ ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు జొన్నల చంద్రశేఖర్, ఆర్టీఏ సభ్యుడు తుమ్మల మల్లేష్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**బుల్లెట్ బైక్‌పై మారుమూల గ్రామాల పర్యటన**

అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెదమ బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా కడెం మండలంలోని రోడ్డు సౌకర్యం లేని మారుమూల అటవీ గ్రామాలైన మిద్దచింత, ఇస్లాంపూర్ తదితర ప్రాంతాల్లో బుల్లెట్ బైక్‌పై పర్యటించారు. గ్రామాల్లో విద్యుత్, రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లు, తాగునీరు వంటి సమస్యలను గ్రామస్తులు వారి దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# ప్రపంచ సగటును అధిగమిస్తూ మాతృత్వ మరణాల రేటులో 86% తగ్గుదలను సాధించిన భారత్: శ్రీ జె.పి.నడ్డా

న్యూఢిల్లీ, జూన్ 11: ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అత్యంత ప్రాధాన్యతా కార్యక్రమం - ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) - దేశవ్యాప్తంగా సురక్షిత మాతృత్వాన్ని నిర్ధారించే దిశగా అంకితభావంతో సేవలందిస్తూ ఈ రోజు 10 సంవత్సరాలు పూర్తి చేసుకుంది.

సురక్షిత గర్భధారణ, ఆరోగ్యకరమైన మాతృత్వాన్ని నిర్ధారించడమే లక్ష్యంగా భారత ప్రభుత్వం చేపట్టిన ప్రధాన కార్యక్రమాల్లో ఒకటైన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) దశాబ్దం పూర్తిచేసుకున్న ఈ ముఖ్యమైన ప్రస్థానాన్ని పురస్కరించుకుని, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రి శ్రీ జె.పి. నడ్డా నేడు "పీఎంఎస్ఎంఏ 10 సంవత్సరాలు - ఒక దశాబ్దపు సంరక్షణ" అనే ఇతివృత్తంతో దేశవ్యాప్తంగా వేడుకలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా శ్రీ జె.పి. నడ్డా ప్రసంగిస్తూ, ఈ ఘనత దేశం మొత్తానికి ఎంతో గర్వకారణమని, సంతృప్తినిచ్చే విషయమని పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంగా పీఎంఎస్ఎంఏ విజయవంతంగా అమలు కావడం దేశంలోని ప్రతి కుటుంబానికి సురక్షితమైన మాతృత్వాన్ని, ఆరోగ్యకరమైన శిశువులను అందించాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంకల్పాన్ని నెరవేర్చడంలో ప్రభుత్వానికి ఉన్న అచంచలమైన కట్టుబాటును ప్రతిబింబిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

గత పది సంవత్సరాల కాలంలో పీఎంఎస్ఎంఏ దేశవ్యాప్తంగా మాతాశిశు సంరక్షణ సేవలను బలోపేతం చేయడమే కాకుండా, మరింత ఆరోగ్యకరమైన, దృఢమైన భారతదేశ నిర్మాణానికి గట్టి పునాది వేసిందని శ్రీ నడ్డా పేర్కొన్నారు. తల్లుల ఆరోగ్యం, శ్రేయస్సును కాపాడటం ఒక ఆరోగ్యకరమైన దేశాన్ని నిర్మించడానికి, స్వాస్థ్య భారత్ సంకల్పాన్ని సాధించడానికి అత్యంత ప్రాథమికమైనదని ఆయన చెప్పారు.

ఈ కార్యక్రమం ఆవిర్భావాన్ని గుర్తు చేస్తూ, ప్రతి నెలా 9వ తేదీన గర్భవతులకు నిపుణులైన వైద్యుల ద్వారా ఉచిత, సమగ్ర, నాణ్యమైన ప్రసవ ముందస్తు సంరక్షణ సేవలను అందించే లక్ష్యంతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2016 జూన్ 9న పీఎంఎస్ఎంఏను ప్రారంభించారని శ్రీ నడ్డా పేర్కొన్నారు. పీఎంఎస్ఎంఏ కింద ప్రభుత్వంతో స్వచ్ఛందంగా చేతులు కలిపిన ప్రైవేట్ ఆసుపత్రులు, వైద్య నిపుణుల అమూల్యమైన సహకారాన్ని ఆయన కొనియాడారు. ముఖ్యంగా వైద్య సేవలు సరిగ్గా అందని ప్రాంతాలలో గర్భవతులకు నిపుణులైన వైద్యుల సంరక్షణను అందుబాటులోకి తీసుకురావడంలో వీరి భాగస్వామ్యం ఎంతో దోహదపడిందని ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సురక్షితమైన ప్రసవ ఫలితాలను సాధించడంలో ముందస్తు సంరక్షణ అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ మాతాశిశు సంరక్షణ వ్యవస్థ కింద, గర్భవతులు క్రమం తప్పకుండా ప్రసవ పూర్వ పరీక్షలు పొందుతున్నారని, ఇందులో భాగంగానే పీఎంఎస్ఎంఏ కింద నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ప్రత్యేక పరీక్షలు కూడా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యేంతవరకు గర్భవతులను గుర్తించడంలోనూ, వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించడంలోనూ వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించడంలోనూ ఆశా కార్యకర్తలు పోషిస్తున్న కీలక పాత్రను కూడా ఆయన ప్రశంసించారు.

జనవరి 2022లో ఈ పథకం విస్తరణ (ఈ-పీఎంఎస్ఎంఏ) వ్యూహాన్ని ప్రారంభించడాన్ని ప్రస్తావిస్తూ, గర్భధారణ సమయంలో తీవ్ర ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించిన మహిళలను మరింత నిశితంగా పర్యవేక్షించడానికీ, తదుపరి జాగ్రత్తలు తీసుకోవడానికీ ఈ చొరవను తీసుకొచ్చినట్లు శ్రీ నడ్డా తెలిపారు. ఈ-పీఎంఎస్ఎంఏ కింద, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న గర్భవతులను ప్రత్యేకంగా జాబితా చేసి ప్రతి ఒక్కరినీ వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తారు. తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉండేలా చూసేందుకు ప్రసవం జరిగిన తర్వాత కూడా 45 రోజుల వరకు వీరి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తారని ఆయన వివరించారు. ఎస్ఎంఎస్ ద్వారా అలర్ట్‌లు, ఫ్రంట్‌లైన్ ఆరోగ్య కార్యకర్తల మెరుగైన మద్దతు ఈ సంరక్షణ ప్రక్రియ నిరంతరాయంగా సాగడానికి మరింత బలాన్ని చేకూర్చాయని ఆయన తెలిపారు. కమ్యూనిటీ స్థాయిలో గర్భవతులను చేరుకోవడానికీ, ఫాలో-అప్ సేవలను మెరుగుపరచడానికి ఆశా కార్యకర్తలకు అందిస్తున్న అదనపు ప్రోత్సాహకాలు ఎంతో సహాయపడ్డాయని ఆయన పేర్కొన్నారు.

మాతాశిశు సంరక్షణ రంగంలో సాధించిన విజయాలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, భారత్ సాధించిన ప్రగతికి అంతర్జాతీయంగా గుర్తింపు లభించిందని శ్రీ నడ్డా పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితికి చెందిన మెటర్నల్ మోర్టాలిటీ ఎస్టిమేషన్ ఇంటర్-ఏజెన్సీ గ్రూప్ (యూఎన్- ఎంఎంఈఐజీ) తాజా నివేదికను ఉటంకిస్తూ, 1990 నుంచి భారత దేశంలో ప్రసవ సమయాల్లో తల్లుల మరణాల రేటు గణనీయంగా 86 శాతం మేర తగ్గిందని ఆయన వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా నమోదైన సగటు తగ్గుదల (48 శాతం) కంటే ఇది చాలా ఎక్కువ కావడం విశేషమని ఆయన పేర్కొన్నారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లల మరణాల రేటు తగ్గించడంలో కూడా భారత్ 79 శాతం తగ్గుదలను నమోదు చేసిందని, ఇది ప్రపంచ సగటు తగ్గుదల 61 శాతం కంటే ఎంతో మెరుగైనదని ఆయన పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితికి చెందిన ఇంటర్-ఏజెన్సీ గ్రూప్ ఫర్ చైల్డ్ మోర్టాలిటీ ఎస్టిమేషన్ (యూ ఎన్- ఐజీఎంఈ) నివేదికను ప్రస్తావిస్తూ, 1990 నుంచి 2024 మధ్య కాలంలో దేశంలో నవజాత శిశు మరణాల రేటు 70 శాతం మేర తగ్గిందని, ప్రపంచవ్యాప్తంగా నమోదైన 54 శాతం తగ్గుదలతో పోలిస్తే ఇది అత్యుత్తమ ప్రగతి అని ఆయన ప్రముఖంగా వివరించారు.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే - ఎన్ఎఫ్‌హెచ్ఎస్) తాజా ఫలితాల్లో వ్యక్తమైన సానుకూల మార్పులను కూడా శ్రీ నడ్డా ఈ సందర్భంగా ప్రస్తావించారు.. దేశంలో ఆసుపత్రి కాన్పులు 90.6 శాతానికి పెరిగాయని, అలాగే గర్భవతులకు ప్రసవ పూర్వ సంరక్షణ స్థాయి 95.9 శాతానికి చేరిందని ఆయన పేర్కొన్నారు. ఈ విజయాలు దేశంలో బలోపేతమైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలకూ, మెరుగైన సేవల లభ్యతకూ, తల్లుల ఆరోగ్యంపై కుటుంబాలలో పెరిగిన అవగాహనకు నిదర్శనాలని ఆయన కొనియాడారు. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కావు. సమయానుకూల సంరక్షణ, ముందస్తు జోక్యం, మన ఆరోగ్య కార్యకర్తల సమిష్టి కృషితో తల్లుల, నవజాత శిశువుల సంరక్షణకు ఇవి నిదర్శనాలు" అని ఆయన పేర్కొన్నారు.

పీఎంఎస్ఎంఏ విజయవంతం కావడానికి కృషి చేసిన వైద్యులు, నర్సులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఫ్రంట్‌లైన్ ఆరోగ్య సిబ్బంది, రాష్ట్ర ప్రభుత్వాలు, అభివృద్ధి భాగస్వాములు, ప్రైవేట్ రంగ నిపుణుల అంకితభావాన్ని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి అభినందించారు. దేశంలోని ప్రతి గర్భవతికి తన గర్భధారణ కాలంలోనూ, ప్రసవానంతరం కూడా సకాలంలో, సులభంగా, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందేలా చూసేందుకూ, మాతా శిశు ఆరోగ్య సంరక్షణ సేవలను మరింత బలోపేతం చేయడానికీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీమతి పుణ్య సలిల శ్రీవాస్తవ మాట్లాడుతూ, భారతదేశంలో మాతృత్వ రక్షణలోనూ, మాతాశిశు ఆరోగ్య ఫలితాలను మెరుగుపరచడంలోనూ ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పది సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ఒక అసాధారణ ఘట్టమని అభివర్ణించారు. గత దశాబ్ద కాలంలో పీఎంఎస్ఎంఏ భారత ప్రభుత్వానికి చెందిన అత్యంత ప్రభావవంతమైన ప్రజారోగ్య కార్యక్రమాలలో ఒకటిగా అవతరించిందని, దేశవ్యాప్తంగా కోట్ల మంది మహిళలు, కుటుంబాల జీవితాలను ఇది ప్రభావితం చేసిందని ఆమె పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం వెనుక ఉన్న సంకల్పాన్ని గుర్తుచేసుకుంటూ, 2016 జూన్ లో పీఎంఎస్ఎంఏ ప్రారంభమైన కొద్దిరోజులకే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2016 జూలైలో తన 'మన్ కీ బాత్' ప్రసంగంలో ఒక పిలుపునిచ్చారని ఆమె గుర్తుచేశారు. ఈ పథకం కింద గర్భవతులకు ఉచిత ప్రసవ పూర్వ సంరక్షణ సేవలను అందించడం కోసం ప్రభుత్వ, ప్రైవేట్ రంగానికి చెందిన వైద్యులు ప్రతి నెలా కనీసం ఒక రోజును కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారని ఆమె పేర్కొన్నారు. వైద్య సమాజం నుంచి లభించిన అపూర్వమైన స్పందన ఈ కార్యక్రమ విజయానికి ఎంతగానో దోహదపడిందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వ్యాప్తంగా 9,000 మందికి పైగా ప్రైవేట్ వైద్యులు/ఆసుపత్రులు పీఎంఎస్ఎంఏ కింద నమోదు చేసుకున్నారని ఆమె వెల్లడించారు. ముఖ్యంగా వైద్య సేవలు సరిగ్గా అందని ప్రాంతాలు, మారుమూల గ్రామాలు, ఆకాంక్షాత్మక జిల్లాలలో గర్భవతులకు నిపుణులైన వైద్యుల నుంచి ప్రసవ పూర్వ సంరక్షణ సేవలు అందుబాటులోకి రావడానికి ఇది ఎంతో సహాయపడిందని ఆమె వివరించారు.

ఈ కార్యక్రమం ప్రభావాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, దేశంలో మాతా శిశు ఆరోగ్య సూచికలను మెరుగుపరచడంలో ఈ కార్యక్రమం గణనీయమైన పాత్ర పోషించిందని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి తెలిపారు. శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్) గణాంకాల ప్రకారం భారతదేశంలో మాతృ మరణాల నిష్పత్తి 2014-16 కాలంలో ప్రతి లక్ష సజీవ జననాలకు 130 గా ఉండగా, అది 2022-24 నాటికి 87 కి తగ్గిందని, ఇది 43 పాయింట్ల తగ్గుదలను సూచిస్తోందని ఆమె వివరించారు. నవజాత శిశు మరణాల రేటు కూడా ప్రతి 1,000 సజీవ జననాలకు 24 నుంచి 18 కి తగ్గిందని, తల్లులు, నవజాత శిశువుల ప్రాణాలను కాపాడటంలో నిరంతరాయంగా సాగుతున్న ప్రగతికి ఇది అద్దం పడుతోందని ఆమె పేర్కొన్నారు.

తాజా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఫలితాల్లో వ్యక్తమైన ప్రోత్సాహకరమైన మార్పులను కూడా ఆమె ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రసవ పూర్వ సంరక్షణ పొందుతున్న తల్లుల సంఖ్య 95.9 శాతానికి పెరగగా, గర్భధారణ సమయంలో కనీసం నాలుగు సార్లు ప్రసవ పూర్వ పరీక్షలు చేయించుకున్న మహిళల శాతం 65.2 శాతానికి చేరింది. గర్భం దాల్చిన తొలి మూడు నెలల్లో ప్రసవ పూర్వ సంరక్షణ కోసం పేరు నమోదు చేయించుకునే వారి సంఖ్య 76.2 శాతానికి మెరుగుపడగా, ఆసుపత్రి కాన్పులు 90.6 శాతానికి పెరిగాయని ఆమె వివరించారు. దేశవ్యాప్తంగా వైద్య సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వచ్చాయని, సురక్షిత మాతృత్వంపై అవగాహన పెరిగిందని, సేవలందించే వ్యవస్థలు మరింత బలోపేతం అయ్యాయని ఈ విజయాలు స్పష్టం చేస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు

గత దశాబ్ద కాలంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ సాధించిన విస్తృతి ముందెన్నడూ లేని విధంగా ఉందని శ్రీమతి శ్రీవాస్తవ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి దీని కింద 7.5 కోట్లకు పైగా ప్రసవ పూర్వ పరీక్షలు నిర్వహించగా, దాదాపు 1.2 కోట్ల మందిని అత్యంత ప్రమాదకర కేసులుగా గుర్తించారు. సకాలంలో గుర్తించడం వల్ల వారికి సరైన రెఫరల్స్, నిపుణులైన వైద్యుల జోక్యం, మెరుగైన పర్యవేక్షణ సాధ్యమయ్యాయని, తద్వారా తల్లులు, నవజాత శిశువులు ఇద్దరికీ మెరుగైన ఆరోగ్య ఫలితాలు చేకూరాయని ఆమె పేర్కొన్నారు.

విస్తృత పిఎంఎస్ఎంఏ వ్యూహాన్ని తీసుకురావడం వల్ల గుర్తించిన అత్యంత ప్రమాద స్థితి గర్భవతులను నిరంతరం పర్యవేక్షించడం, వారికి నిరంతరాయ వైద్య సేవలు అందించడం మరింత బలోపేతమైందని ఆమె తెలిపారు. ఈ ప్రయత్నాలకు తోడు పీఎంఎంఎస్ఏ, ఈ-పీఎంఎంఎస్ఏ కింద నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో లభించే ప్రసవ పూర్వ సంరక్షణ సేవలు, బలోపేతం చేసిన రెఫరల్ వ్యవస్థల వల్ల తల్లులు, నవజాత శిశువుల మనుగడ రేటు పెరిగిందని, ప్రసవ సమయాల్లో తలెత్తే సంక్లిష్టతలను ఎదుర్కొనే సన్నద్ధత మెరుగైందని ఆమె పేర్కొన్నారు. జననీ సురక్షా యోజన (జేఎస్వై), జననీ శిశు సురక్షా కార్యక్రమం (జేఎస్ఎస్కే), ప్రధాన మంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) వంటి ప్రతిష్ఠాత్మక మాతృ సంక్షేమ పథకాలను ప్రజలు మరింత ఎక్కువగా వినియోగించుకునేలా ఈ చర్యలు దోహదపడ్డాయని ఆమె వివరించారు.

పిఎంఎస్ఎంఏ విజయానికి అంకితభావంతో దోహదపడిన ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్యులు, నిపుణులు, అభివృద్ధి భాగస్వాములు, శ్రీప్రైవేట్ రంగ వాలంటీర్ల కృషిని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి అభినందించారు. రాబోయే సంవత్సరాల్లో కూడా దేశవ్యాప్తంగా సురక్షితమైన మాతృత్వాన్ని పెంపొందించడంలోనూ, మాతా, శిశు ఆరోగ్య సంరక్షణ సేవలను బలోపేతం చేయడంలోనూ ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తూనే ఉంటుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ వేడుకల్లో భాగంగా, గర్భిణులు,వారి కుటుంబ సభ్యులు పిఎంఎస్ఎంఏ కింద అందుబాటులో ఉన్న తొమ్మిది రకాల ఉచిత హామీ సేవలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించడానికీ, సకాలంలో నాణ్యమైన ప్రసవ పూర్వ సంరక్షణ పొందవలసిన ప్రాముఖ్యతను వివరించడానికి 2026 జూన్ 9 నుంచి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో అవగాహన, ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలను చేపట్టారు.

పిఎంఎస్ఎంఏ పదేళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని, దేశంలో మాతృ ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేయడంలో అది అందించిన సహకారానికి గుర్తింపుగా శ్రీ నడ్డా ప్రత్యేక రూ. 75 స్మారక నాణేన్ని రూ. 5 పోస్టల్ స్టాంపును విడుదల చేశారు.

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీమతి అనుప్రియ పటేల్, భారతదేశానికి డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి డాక్టర్ ఇవాన్ జె. ఎఫ్. హటిన్, ఎన్ హెచ్ఎమ్ అదనపు కార్యదర్శి, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి ఆరాధన పట్నాయక్, కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కల్నల్ అఖిలేష్ కుమార్ పాండే, వివిధ రాష్ట్రాల చీఫ్ మెడికల్ ఆఫీసర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జమ్మూకాశ్మీర్.. లద్దాఖ్‌ల పరిణామాత్మక అనుసంధానాన్ని విశదీకరించిన రోడ్డు రవాణా-రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, జూన్ 11:కార్గిల్ జిల్లాలోని మినామార్గ్‌లో జోజిలా టన్నెల్ ప్రాజెక్ట్ తూర్పు ముఖద్వారం వద్ద ప్రధాన సొరంగం చారిత్రక ప్రారంభాన్ని కేంద్ర రోడ్డు రవాణా-రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ ఈ రోజు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి శ్రీ ఒమర్ అబ్దుల్లా, పలువురు ఎంపీలు, ప్రజాప్రతినిధులు, సీనియర్ అధికారులు, విశిష్ట అతిథులు పాల్గొన్నారు. లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ వినయ్ కుమార్ సక్సేనా ఆన్‌లైన్ ద్వారా పాల్గొని, జోజిలా టన్నెల్ ప్రాజెక్ట్ పురోగమనంలో ఇదొక కీలక ఘట్టమని పేర్కొన్నారు.

జాతీయ రహదారి మౌలిక సదుపాయాల కల్పనలో ఈ సొరంగారంభం ఓ కీలక మలుపుగా నిలుస్తుంది. ఇది జమ్ము, కశ్మీర్, లద్దాఖ్‌ల మధ్య ఏడాది పొడవునా అనుసంధానం కల్పిస్తూ ఆ ప్రాంతాలను దేశంలోని ఇతర ప్రాంతాలకు మరింత చేరువ చేస్తుంది.

జాతీయ రహదారి-1 పరిధిలో పై బల్టల్-మినామార్గ్ మధ్య నిర్మితమవుతున్న దాదాపు 14 కిలోమీటర్ల పొడవైన ద్విదిశాత్మక జోజిలా సొరంగం దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక పర్వత ప్రాంత మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ఒకటి. దాదాపు ?6,800 కోట్ల వ్యయంతో 2,900 మీటర్ల నుంచి 3,310 మీటర్ల ఎత్తున రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టు ప్రపంచంలోనే ఒక అత్యంత కఠిన భౌగోళిక ప్రదేశంలో సాధించిన కీలక ఇంజనీరింగ్ విజయంగా నిలుస్తుంది. భారీ హిమపాతం, కఠిన వాతావరణ పరిస్థితులు, సంక్లిష్ట భౌగోళిక సవాళ్లు ఉన్నప్పటికీ- ఇంజనీర్లు, కార్మికులు, కన్సల్టెంట్లు, కాంట్రాక్టర్లు, నేషనల్ హైవేస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సహా ఇతర భాగస్వాముల కృషితో ఈ ప్రాజెక్టు నిలకడగా పురోగమిస్తోంది. ఈ పురోగతిలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరినీ శ్రీ గడ్కరీ ఈ సందర్భంగా అభినందించారు.

సురక్షితమైన, సమర్థ ప్రయాణానికి భరోసా ఇస్తూ ఈ సొరంగంలో ఆధునిక వెంటిలేషన్ వ్యవస్థలు, ఆటోమేటిక్ ఫైర్ డిటెక్షన్ వ్యవస్థలు, అత్యాధునిక సీసీటీవీ నిఘా సహా పాదచారుల కోసం క్రాస్-పాసేజ్ సదుపాయం కూడా కల్పిస్తామని శ్రీ నితిన్ గడ్కరీ వెల్లడించారు.

భారీ హిమపాతం, భౌగోళిక సవాళ్లను ఎదుర్కోవడంలో భాగంగా ఈ ప్రాజెక్టులో 8 కట్-అండ్-కవర్ విభాగాలు, నాలుగు వంతెనలు, 40 కల్వర్టులు, స్నో గ్యాలరీలు, క్యాచ్ డ్యాములు, హిమపాత రక్షణ కట్టలు, అప్రోచ్ రోడ్లు, అత్యాధునిక భద్రతా ఏర్పాట్లు వంటివన్నీ ఉంటాయి.

జోజిలా సొరంగం ఒక రవాణా ప్రాజెక్టుకు పరిమితం కాదని, ఈ ప్రాంత ప్రగతికి రాచబాట కాగలదని శ్రీ గడ్కరీ అన్నారు. ఇది పూర్తయితే, సోనామార్గ్, మినామార్గ్ మధ్య 2 గంటల ప్రయాణం దాదాపు 30 నిమిషాలకు తగ్గిపోతుంది. తద్వారా సమయం, ఇంధనం గణనీయంగా ఆదా అవుతాయి. అలాగే, ప్రమాదాల ముప్పు తోపాటు హిమపాతం లేదా ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల కలిగే అంతరాయాలు తప్పుతాయి. ఈ సొరంగంతో పర్యాటక రంగానికి ప్రోత్సాహం లభించడంతోపాటు వాణిజ్య సౌలభ్యం కలుగుతుందని, మారుమూల ప్రాంతాలకు బాటలు వేస్తుందని, సరిహద్దు ప్రాంతాలతో అనుసంధానాన్ని బలపరుస్తుందని అంచనా. జాతీయ భద్రత దృక్కోణంలో చూస్తే, ఏడాది పొడవునా అనుసంధానం వల్ల భారత సైన్యం, పరికరాలు, సరఫరాలు, రవాణా వేగంగా మరింత సమర్థంగా సాగుతాయి. తద్వారా వ్యూహాత్మక సంసిద్ధత కూడా బలోపేతం అవుతుంది.

ఈ ప్రాజెక్టు మెరుగైన అనుసంధానం, ప్రాంతీయ సమైక్యత ద్వారా ఉపాధి అవకాశాలను కూడా సృష్టిస్తుంది. ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడమే కాకుండా స్థానిక సమాజాల జీవన నాణ్యతను మెరుగుపరుస్తుంది.

కార్గిల్, లేహ్-లద్దాఖ మధ్య సుమారు 18,000 కోట్ల విలువైన రహదారి, సొరంగ ప్రాజెక్టులు పురోగమనంలో ఉన్నాయని మంత్రి తెలిపారు.

ఇక్కడి కీలక కార్యక్రమాలలో కార్గిల్-జాన్స్కార్-పదుమ్ హైవే ప్రాజెక్ట్ ఒకటి. ఇది జాన్స్కార్ ప్రాంతానికి బాటలు వేస్తూ, వ్యూహాత్మక అనుసంధానాన్ని బలోపేతం చేయడంతోపాటు సైన్యం రాకపోకలను సులభతరం చేస్తుంది.

# ఇది అక్రమ కార్యకలాపాలను అరికట్టడంతో పాటు ఒక బలమైన, సురక్షితమైన వ్యవస్థను నిశ్చయంగా అందిస్తుంది: హోం మంత్రి



న్యూ ఢిల్లీ, జూన్ 11: వినిమయ్ పేరుతో ఉన్న ల్యాండ్ పోర్ట్‌ల నిర్వహణ వ్యవస్థను (ఎల్‌పీఎంఎస్-ల్యాండ్ పోర్ట్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ కార్యదర్శి, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) డైరెక్టర్, కార్యదర్శి (సరిహద్దు నిర్వహణ)- ల్యాండ్ పోర్ట్‌ల ప్రాధికార సంస్థ (ల్యాండ్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) చైర్మన్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా మాటాడుతూ... 2014 తర్వాత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దూరదృష్టితో కూడిన నాయకత్వంలో ల్యాండ్ పోర్ట్‌ల ప్రాధికార సంస్థకు సరికొత్త దిశానిర్దేశం లభించిందని అన్నారు. కేవలం భద్రతకే పరిమితం కాకుండా ల్యాండ్ పోర్ట్‌లను (ల్యాండ్ పోర్ట్‌లు) భద్రతకు తొలి రక్షణ శ్రేణిగా, అంతర్జాతీయ వ్యాపారానికి ఒక సాధనంగా, ప్రజల మధ్య సంబంధాలను పెంపొందించే ఒక వారధిగా అభివృద్ధి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సరిహద్దు ప్రాంతాల సమగ్ర అభివృద్ధిలో, చట్టబద్ధమైన వ్యాపారాన్ని ప్రోత్సహించడంలో, సరిహద్దు గ్రామాలు- జిల్లాల నుంచి వలసలు వంటి సవాళ్లను పరిష్కరించడంలో ల్యాండ్ పోర్ట్‌లు అత్యంత కీలక పాత్ర పోషించాయని చెప్పారు. సరిహద్దుల గుండా ప్రజల రాకపోకలు సులభతరం కావడం వల్ల ఇరు దేశాల ప్రజల మధ్య పరస్పర నమ్మకం బలపడిందని, సాంస్కృతిక మార్పిడి పెరిగిందని ఆయన అన్నారు. భారత్ లాంటి సుదీర్ఘమైన భూ సరిహద్దులు కలిగిన దేశంలో సరిహద్దు నిర్వహణ అత్యంత ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని శ్రీ అమిత్ షా స్పష్టం చేశారు.

'స్మార్ట్ సరిహద్దుల' భావన కింద భారత సరిహద్దులను సురక్షితం చేయడానికి కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ చతుర్ముఖ వ్యూహంపై పని చేస్తోందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా తెలిపారు. ఈ స్మార్ట్ సరిహద్దుల దార్శనికతను సాకారం చేయడంలో ల్యాండ్ పోర్ట్‌ల ప్రాధికార సంస్థ కీలక పాత్ర పోషించనుందని ఆయన పేర్కొన్నారు. భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూనే భాగస్వాములందరి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ల్యాండ్ పోర్ట్‌ల నిర్వహణ వ్యవస్థను (ఎల్‌పీఎంఎస్) రూపొందించినట్లు ఆయన వివరించారు. స్మార్ట్ సరిహద్దుల కార్యక్రమంతో కలిపి ఈ వ్యవస్థ ఒక అభేద్యమైన, సురక్షితమైన సరిహద్దు నిర్వహణ వ్యవస్థను నిర్మించడంలో సహాయపడుతుందని చెప్పారు. స్మార్ట్ సరిహద్దుల కార్యక్రమం, ఎల్‌పీఎంఎస్‌లు సంయుక్తంగా మరింత సురక్షితమైన, ఆధునిక సరిహద్దు నిర్వహణ వ్యవస్థను సృష్టిస్తాయని ఆయన అన్నారు. ఇది అక్రమ కార్యకలాపాలను అరికట్టడానికి.. ఒక బలమైన, సురక్షితమైన వ్యవస్థను ఏర్పాటు చేయడానికి తోడ్పడుతుందని ఆయన స్పష్టం చేశారు.

రేవుల కోసం ల్యాండ్ పోర్ట్‌ల ప్రాధికార సంస్థ అధునాతన, డిజిటల్, సమగ్ర, రియల్-టైమ్ నిర్వహణ వ్యవస్థను అభివృద్ధి చేసిందని.. తద్వారా భాగస్వాములందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చిందని హోం మంత్రి తెలిపారు. ల్యాండ్ పోర్ట్‌ల నిర్వహణ వ్యవస్థ ద్వారా ల్యాండ్ పోర్ట్‌ల ఏర్పాటు వెనుక ఉన్న ప్రధాన ఆశయాన్ని ల్యాండ్ పోర్ట్‌ల ప్రాధికార సంస్థ నెరవేర్చిందని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ల్యాండ్ పోర్ట్‌ల నిర్వహణ వ్యవస్థను దేశంలోని 'స్మార్ట్ భద్రతా వలయం'లో ఒక అంతర్భాగంగా మార్చనున్నట్లు ఆయన తెలిపారు. తద్వారా దేశ ఆర్థిక భద్రతతో పాటు భౌతిక భద్రతను కూడా సురక్షితం చేయనున్నట్లు పేర్కొన్నారు. ల్యాండ్ పోర్ట్‌ల ప్రాధికార సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమం 'స్మార్ట్ సరిహద్దుల' దార్శనికతను పూర్తిగా సాకారం చేయడంలో సహాయపడుతుందని ఆయన అన్నారు. ఈ వ్యవస్థ సరుకు రవాణా, ప్రయాణికులు, వాహనాల నిర్వహణ కోసం ఒక సమగ్ర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను అందిస్తుంది. ఇది వివిధ ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయాన్ని పెంపొందిస్తుంది.. సమాచార మార్పిడిని ఎంతో సులభతరం చేస్తుంది. దీనివల్ల దాదాపు 90 శాతం కాగితపు పనులు తొలగిపోతాయి. 'సింగిల్ ఎలక్ట్రానిక్ విండో', నంబర్ ప్లేట్‌ను స్వయం చాలితంగా గుర్తించే వ్యవస్థ (ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్- ఏఎన్‌పీఆర్) ఆధారిత గేట్ నిర్వహణ వ్యవస్థ వల్ల సమయం భారీగా ఆదా అవుతుంది. ట్రక్కుల నిరీక్షణ సమయం సుమారు 40 శాతం నుంచి 60 శాతం వరకు తగ్గుతుందని, గేట్ ప్రాసెసింగ్ సమయం 22 శాతం నుంచి 35 శాతం వరకు తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ఇది కేవలం వ్యాపారాన్ని పెంపొందించడమే కాకుండా పర్యాటకాన్ని కూడా ప్రోత్సహిస్తుంది. ఇది ఇరు దేశాల ప్రజల మధ్య మెరుగైన సమన్వయం, సంభాషణలు, సాంస్కృతిక మార్పిడికి దోహద పడుతుందని శ్రీ అమిత్ షా స్పష్టం చేశారు.

ఎల్‌పీఎంఎస్ ద్వారా ఒకే ఉమ్మడి వేదికపై ఐస్‌గేట్, మోటార్ వాహనాల వ్యవస్థ, సీబీఐసీ, బీఎస్ఎఫ్, డీజీఎఫ్‌టీ, యూఐడీఏఐ, యూఎల్ఐపీల మధ్య ఎప్పటికప్పుడు డేటా షేరింగ్ జరుగుతుందని.. ఇది సరిహద్దుల్లో పనిచేసే వివిధ ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తుందని కేంద్ర హోం మంత్రి అన్నారు. ఈ భాగస్వాములందరి మధ్య సమన్వయాన్ని, సమాచార మార్పిడిని పెంపొందించే ఇటువంటి ప్లాట్‌ఫామ్ దేశానికి ఎంతో ప్రయోజనకరంగా మారుతుందని, అభివృద్ధికి సరికొత్త వేగాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో ల్యాండ్ పోర్ట్‌లు అద్భుతమైన మార్పునకు లోనయ్యాయని ఆయన చెప్పారు. 2014లో ల్యాండ్ పోర్ట్‌ల ద్వారా జరిగిన వాణిజ్యం కేవలం రూ. 5,000 కోట్లుగా ఉండగా ఇప్పుడు అది 16 రెట్ల వృద్ధితో రూ. 83,000 కోట్లకు పెరిగిందని అన్నారు. ప్రస్తుతం దేశంలో 15 ల్యాండ్ పోర్ట్‌లు పనిచేస్తున్నాయని.. రాబోయే రెండు నుంచి మూడు ఏళ్లలో మరో 11 అదనపు ల్యాండ్ పోర్ట్‌లు అందుబాటులోకి రానున్నాయని శ్రీ అమిత్ షా వెల్లడించారు. ల్యాండ్ పోర్ట్‌ల విషయంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నిర్దేశించిన దార్శనికత నిర్ణీత కాలపరిమితిలోగా నెరవేరుతుందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఆశాభావం వ్యక్తం చేశారు. ల్యాండ్ పోర్ట్‌ల ప్రాధికార సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని 'స్మార్ట్ సరిహద్దు' అనే భావనతో అనుసంధానించినప్పుడు... ల్యాండ్ పోర్ట్‌ల ప్రాధికార సంస్థ భారతదేశ ఆర్థిక భద్రత, సరిహద్దు భద్రత రెండింటిలోనూ ఒక అత్యంత కీలకమైన భాగంగా మారుతుందని ఆయన అన్నారు.

2026 జూన్ 9వ తేదీ దేశ చరిత్రలో ఒక అత్యంత కీలకమైన రోజుగా నిలిచిపోతుందని కేంద్ర హోం మంత్రి అన్నారు. ప్రధాన మంత్రిగా శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలో నిర్విరామంగా 12 ఏళ్ల పాలన పూర్తయిన సందర్భం ఇదని ఆయన పేర్కొన్నారు. కొంతమంది నాయకులు కేవలం అధికారంలో కొనసాగడానికే తమ సమయాన్ని వెచ్చిస్తుంటే శ్రీ నరేంద్ర మోదీ మాత్రం గత 12 ఏళ్ల పదవీ కాలాన్ని నిరంతర సేవకే అంకితం చేశారని, దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించారని చెప్పారు. మోదీ దేశ సేవనే తన జీవిత పరమార్థంగా మార్చుకున్నారని, దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి నిరంతరం కట్టుబడి ఉన్నారని ఆయన అన్నారు. ఒక నిస్వార్థ కర్మయోగిలా మోదీ ఎన్నో మైలురాళ్లను అధిగమించారని.. ఆయన కృషి వల్లే నేడు భారత్ వివిధ రంగాలలో ప్రపంచవ్యాప్త ప్రమాణంగా, ప్రగతికి నిదర్శనంగా నిలిచిందని శ్రీ అమిత్ షా కొనియాడారు.

ఒక ఎన్నికైన ప్రధాన మంత్రిగా శ్రీ నరేంద్ర మోదీ నేటితో పదవిలో 4,398 రోజులు పూర్తి చేసుకున్నారని.. రేపటితో మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించనున్నారని తెలిపారు. దీనితో భారత్‌లో అత్యంత సుదీర్ఘకాలం నిర్విరామంగా పనిచేసిన ఎన్నికైన ప్రధానమంత్రిగా దేశానికి సేవలందించిన ఘనత మోదీకి దక్కుతుందని ఆయన అన్నారు. తన పదవీ కాలంలో నరేంద్ర మోదీ ప్రజల సంక్షేమాన్నే సుపరిపాలనకు మూలసూత్రంగా మార్చారని ఆయన పేర్కొన్నారు.

భారత్‌లోని ప్రతి ఒక్కరికి సొంత పక్కా ఇల్లు ఉండాలనే సరికొత్త దార్శనికతను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తీసుకువచ్చారని కేంద్ర హోం మంత్రి అన్నారు. నేడు ఇప్పటికే దాదాపు 4 కోట్ల పక్కా ఇళ్లను భారత ప్రజలకు అందించినట్లు తెలిపిన ఆయన.. మరో 2 కోట్ల ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందని పేర్కొన్నారు. రాబోయే రెండేళ్లలో భారత్‌లో సొంత పక్కా ఇల్లు లేని కుటుంబం అంటూ ఒక్కటి కూడా ఉండబోదని ఆయన చెప్పారు. ఇళ్లతో పాటు ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్లు, మరుగుదొడ్లు, సురక్షితమైన తాగునీరు, రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్య బీమా సౌకర్యం, ప్రతి నెలా ఒక్కొక్కరికి 5 నుంచి 7 కిలోల ఉచిత ఆహార ధాన్యాలను అందిస్తున్నట్లు శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. ఇటువంటి అవసరమైన సేవలను పొందడం కోసం తరతరాలుగా ఇబ్బందులు పడిన కుటుంబాలకు నరేంద్ర మోదీ తన 12 ఏళ్ల పదవీ కాలంలోనే ఈ ప్రాథమిక వసతులను కల్పించారని ఆయన అన్నారు.

మోదీ అభివృద్ధి అనే పదానికి కొత్త నిర్వచనాన్ని ఇచ్చారని శ్రీ అమిత్ షా కొనియాడారు. భారత పరిపాలనా చరిత్రలో సుపరిపాలన, ప్రగతికి సంబంధించిన ప్రతి రంగాన్ని కలుపుకుంటూ 'సమగ్ర అభివృద్ధి'(360 డిగ్రీల అభివృద్ధి) అనే సరికొత్త భావనను ఆయన ప్రవేశపెట్టారని చెప్పారు. నేడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతోన్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందని అన్నారు. గత 12 ఏళ్లలో 25 కోట్ల ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని హోం మంత్రి వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా అస్థిరమైన వాతావరణం ఉన్నప్పటికీ భారత్ స్థిరత్వం, పట్టుదలతో తన లక్ష్యాల వైపు నిలకడగా, వేగంగా దూసుకుపోతోందని ఆయన స్పష్టం చేశారు.

గత 12 ఏళ్లలో భారత ప్రజాస్వామ్యం ఒక ప్రాథమిక పరివర్తనకు లోనైందని శ్రీ అమిత్ షా అన్నారు. వారసత్వ రాజకీయాలు, సామాజిక వర్గాల ఆధారిత రాజకీయాలు, అవినీతి అనేవి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎంతలా వేరూనుకుపోయాయంటే ప్రజలు వాటితో కలిసి జీవించడానికి అలవాటు పడిపోయారని ఆయన గుర్తుచేశారు. అయితే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో చాలా కాలం నిలిచిపోయేలా ఒక మౌలిక మార్పును తీసుకువచ్చారు. కుటుంబ వారసత్వం, సామాజిక వర్గ సమీకరణాలు, అవినీతి ద్వారా కూడబెట్టిన సంపద ప్రభావంతో నడిచే పాత రాజకీయాల స్థానంలో పనితీరు, సుపరిపాలన కేంద్రంగా సాగే సరికొత్త రాజకీయాలను నరేంద్ర మోదీ ప్రవేశపెట్టారని ఆయన అన్నారు. దీని ఫలితంగానే అనేక రాష్ట్రాల్లో తమ ప్రభుత్వాలు మళ్లీ మళ్లీ అధికారంలోకి రావడం చూశామని... ఇది మరింత స్థిరత్వానికి, దీర్ఘకాలిక విధానాల రూపకల్పనకు, ఆ విధానాల సమర్థవంతమైన అమలు-పర్యవేక్షణకు దారితీసిందని చెప్పారు. దేశ రాజకీయ చరిత్రలో 'పనితీరు ఆధారిత రాజకీయాలను' నెలకొల్పిన ఘనత ఎవరికైనా ఇవ్వాల్సి వస్తే అది ముమ్మాటికీ శ్రీ నరేంద్ర మోదీకే దక్కుతుందని కేంద్ర హోం మంత్రి స్పష్టం చేశారు. శ్రీ నరేంద్ర మోదీ కేవలం మహిళా అభివృద్ధి గురించి మాట్లాడటమే కాకుండా 'మహిళల నేతృత్వంలోని అభివృద్ధి' అనే భావనను ముందుకు తీసుకెళ్లారని అన్నారు. ఒకప్పుడు సాయుధ దళాలు, పోలీసింగ్, శాస్త్ర విజ్ఞానం, పరిశోధన, పారిశ్రామికవేత్తలు, డ్రోన్లు, క్రీడలు, అంకురాలు, అంతరిక్షం వంటి రంగాల్లో మహిళలను నాయకత్వ పాత్రల్లోకి ప్రోత్సహించడానికి సమాజంలో కొంత సంకోచం ఉండేదని ఆయన గుర్తుచేశారు. అత్యంత సవాలుతో కూడిన సరిహద్దు ప్రాంతాల్లో కూడా సరిహద్దు భద్రతా దళంలో (బీఎస్ఎఫ్) సరిహద్దు రక్షకులుగా పురుషులతో సమానంగా మహిళలు సేవలు అందించడం చూడటం ఎంతో గర్వకారణంగా, సంతృప్తిగా ఉందని ఆయన అన్నారు. శ్రీ నరేంద్ర మోదీ ప్రజా భాగస్వామ్య భావనను కూడా పూర్తిగా మార్చివేశారని ఆయన పేర్కొన్నారు. ఆకాంక్షిత జిల్లాలు, ఆకాంక్షిత ప్రాంతాల (ఆస్పిరేషనల్ బ్లాక్స్) ఏర్పాటు ద్వారా ఆయన సమ్మిళిత అభివృద్ధి దార్శనికతను నిజం చేసి చూపించారని అన్నారు. అభివృద్ధి ప్రయాణంలో వెనుకబడిన జిల్లాలను దేశంలోని అత్యంత అభివృద్ధి చెందిన జిల్లాలతో సమానంగా తీసుకురావాలనే లక్ష్యంతో 30 కంటే ఎక్కువ పారామితులలో నిర్దిష్ట అభివృద్ధి లక్ష్యాలను, తగిన వనరులను కేటాయించినట్లు చెప్పారు. అనేక ఆకాంక్షిత జిల్లాలు ఇప్పుడు పలు పారామితులలో దేశంలోని మొదటి ఐదు జిల్లాలతో పోటీపడే స్థాయికి చేరుకున్నాయని ఆయన వెల్లడించారు. ఈ సమ్మిళిత అభివృద్ధి దార్శనికత ఇప్పుడు పరిపాలనాపరమైన ప్రేరణ, ప్రజల ఆకాంక్షల మేల్కొలుపు, సామూహిక ప్రయత్నంతో ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. అంతకుముందు కేవలం ప్రభావవంతమైన మంత్రులు లేదా పార్లమెంట్ సభ్యులు ప్రాతినిధ్యం వహించే జిల్లాలకే పెద్ద ఎత్తున అభివృద్ధి నిధులు అందుతాయనే నమ్మకం ఉండేదని.. కానీ ఇప్పుడు ఆ ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయిందని ఆయన తెలిపారు.

## కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి - మెదక్ ఎస్పీ శ్రీనివాస రావు

మెదక్, జూన్ 11: జిల్లాలో నమోదవుతున్న కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించిన క్రైమ్ రివ్యూ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా నమోదైన నేరాలు, వాటి దర్యాప్తు పురోగతి, మిస్సింగ్ కేసులు, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు, గ్రేవ్, నాన్-గ్రేవ్ కేసులు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ అమలు చర్యలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మిస్సింగ్ కేసుల దర్యాప్తును అత్యంత ప్రాధాన్యంతో చేపట్టి, అదృశ్యమైన వారి ఆచూకీ త్వరితగతిన గుర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యానికి తావు లేకుండా చట్టపరమైన గడువుల్లోనే దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ డేటాను తప్పనిసరిగా నవీకరించాలని, మాన్యువల్ రికార్డులు సీసీటీ ఎన్ఎస్ నమోదుల మధ్య ఉన్న వ్యత్యాసాలను వెంటనే సరిచేయాలని సూచించారు.

రానున్న జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా రాజీ పడదగిన కేసులను గుర్తించి, సంబంధిత పక్షాలతో సమన్వయం చేసి ఎక్కువ సంఖ్యలో కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా ఎన్సీఆర్పీ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

## కార్పొరేట్ వైద్యాన్ని ప్రజలకు చేరవేయడమే లక్ష్యం

-ఐకాన్ ఆస్పత్రిలో విజయవంతంగా వంద బ్రెయిన్ ట్యూమర్ సర్జరీలు

-వివరాలు వెల్లడించిన ఆస్పత్రి ఎండీ డా.శశాంక్ కోడే




నల్గొండ, జూన్ 11:నల్లగొండ జిల్లా ప్రజలకు కార్పోరేట్ స్థాయి వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా ఐకాన్ ఆస్పత్రి పని చేస్తుందని ఆస్పత్రి ఎండీ డా.శశాంక్ కోడే అన్నారు. ఆస్పత్రిలో విజయవంతంగా వంద బ్రెయిన్ ట్యూమర్ సర్జరీలు చేసిన సందర్భంగా గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఒకప్పుడు మెదడు కణితి (బ్రెయిన్ ట్యూమర్) అని నిర్ధారణ అయిన వెంటనే నల్లగొండ జిల్లా ప్రజలు హైదరాబాద్ వంటి పెద్ద నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కుటుంబ సభ్యులను వదిలి, నెలల తరబడి అక్కడ ఉండాల్సి రావడం, లక్షల రూపాయల వైద్య ఖర్చులు భరించడం అనేక కుటుంబాలకు తీవ్రమైన ఆర్థిక, మానసిక భారంగా ఉండేదన్నారు. ఆ పరిస్థితిని మార్చాలనే సంకల్పంతో నల్లగొండలోనే అత్యాధునిక న్యూరో సర్జరీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన ఐకాన్ హాస్పిటల్ మరో అరుదైన మైలురాయిని చేరుకుందని తెలిపారు. నల్లగొండ వైద్య రంగంలో మరో చారిత్రాత్మక అడుగు ముందుకువేసి ఐకాన్ హాస్పిటల్‌లో 100 మెదడు కణితుల శస్త్రచికిత్సలు విజయవంతం చేసినట్లు వెల్లడించారు.అతిబిఎ ఉ ఒనీఇజీశ్రీ ఉబీతిటవబ

ఈ వంద కేసులో సాధారణ శస్త్ర చికిత్సలతో పాటు అత్యంత క్లిష్టమైన, ప్రాణాపాయ స్థితిలో ఉన్న మెదడు కణితి కేసులు కూడా ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లో ఇలాంటి చికిత్సలకు దాదాపు రూ.10 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ ఖర్చు అయ్యే సందర్భాలు ఉన్నప్పటికీ, ఐకాన్ హాస్పిటల్లో అది చాలా తక్కువ ఖర్చుతో ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఆస్పత్రి యాజమాన్యంగా కేవలం శస్త్రచికిత్సలు చేయడమే కాదని గ్రామీణ, పట్టణ ప్రజల మధ్య ఉన్న వైద్య అసమానతలను తగ్గించడం, ప్రపంచ స్థాయి సాంకేతికత, ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, అత్యాధునిక పరికరాలతో వైద్య సేవలు అందించమే లక్ష్యమన్నారు. భవిష్యత్‌లో కూడా మరింత అధునాతన న్యూరో సర్జరీ సేవలు, అత్యవసర మెదడు, వెన్నెముక చికిత్సలు, అత్యుత్తమ వైద్య ప్రమాణాలతో నల్లగొండ ప్రజలకు అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు ఆలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ సాయి మౌనిక చెరుకూరి, డాక్టర్ సాయి లావణ్య కడిమి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు : కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్, జూన్ 11: గురువారం శివంపేట మండల కేంద్రంలోని ఉసిరిక పల్లి గ్రామంలో పోతరాజుల బాలేష్ అనే రైతు తన నాలుగున్నర ఎకరాల పొలంలో సాగు చేస్తున్న సేంద్రియ వ్యవసాయ పంటలను ,సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రైతులు సాగు చేస్తున్న పంటలను మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ నేడు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న వరి, కూరగాయలు, పండ్ల తోటలు, ఇతర పంటలను పరిశీలించి రైతుతో ప్రత్యక్షంగా మాట్లాడారు.

ఈ సందర్భంగా ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయడం అభినందనీయమన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల సారవంతత పెరగడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఎంతో మేలు జరుగుతుందన్నారు. వినియోగదారులకు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందించడంలో సేంద్రియ వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

### మార్కెట్‌లో మంచి డిమాండ్..

రైతులు తయారు చేస్తున్న జీవామృతం, ఘన జీవామృతం, వర్మీ కంపోస్ట్, సేంద్రియ కషాయాలు తదితర సహజ ఎరువుల తయారీ విధానాలను కలెక్టర్ పరిశీలించారు. పంటల ఎదుగుదల, దిగుబడి పరిస్థితులు, సాగు ఖర్చులు, మార్కెటింగ్ అవకాశాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. సేంద్రీయ పద్ధతుల్లో పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో రైతులు మరింత ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు.

వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సాంకేతిక సూచనలు అందిస్తూ సేంద్రియ సాగును విస్తరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవోలు), రైతు వేదికల ద్వారా సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో ఆదర్శ సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలను అభివృద్ధి చేసి ఇతర రైతులకు ప్రేరణ కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అలాగే సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు ధృవీకరణ (సర్టిఫికేషన్), బ్రాండింగ్, మార్కెటింగ్ సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించి సేంద్రియ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

### రైతుల సంక్షేమం కోసం..

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ సేంద్రియ వ్యవసాయాన్ని మరింత విస్తరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలంటే సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం అత్యంత అవసరమన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్, మండల వ్యవసాయ అధికారిణి లావణ్య, సాంకేతిక వ్యవసాయ అధికారి యాదగిరి, వ్యవసాయ విస్తరణ అధికారిణి సౌజన్య , రైతులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలి : కలెక్టర్ రిజ్వాన్ బాషా




మహబూబ్‌నగర్, జూన్ 11: గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకుంటే వివిధ నిధులను సద్వినియోగం చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.

గురువారం 2026-2027 ఆర్థిక సంవత్సరానికి గాను 16వ ఆర్థిక సంఘం నిధుల సద్వినియోగానికి రూపొందించాల్సిన గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్, బ్లాక్ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్, డిస్ట్రిక్ట్ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్‌పై ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు.

గ్రామపంచాయతీలకు వివిధ పన్నుల ద్వారా వచ్చే జనరల్ ఫండ్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు, దాతల విరాళాలతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పక్కా ప్రణాళిక రూపొందించుకుంటేనే ఆయా నిధులను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వ సబ్ కి యోజన, సబ్ కా వికాస్ సైట్ లో జీపీడీపీ వివరాలను ఈనెల 30వ తేదీలోగా అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు.

అధికారుల అలసత్వంతో నిధులు వెనక్కి వెళితే సహించేది లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీపీవో శ్రీకాంత్, మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్ రెడ్డి, డీఆర్డీవో ముషాహిదా బేగం, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కళను ప్రజల చెంతకు చేర్చిన మహోన్నతుడు: చలసాని ప్రసాదరావు జీవితం - సాహిత్యం

తెలుగు సాంస్కృతిక, పత్రికా రంగాల సుదీర్ఘ చరిత్రలో కొన్ని పేర్లు కేవలం వ్యక్తులుగా కాక, ఒక నిశ్శబ్ద విప్లవానికి, అచంచలమైన సృజనాత్మక శక్తికి ప్రతీకలుగా నిలిచిపోతాయి. అటువంటి అరుదైన, మహోన్నత శక్తులలో చలసాని ప్రసాదరావు అగ్రగణ్యులు. శారీరక వైకల్యాల పరిమితులను అధిగమించి, ముఖ్యంగా ఒక మేధావికి అత్యంత ఆవశ్యకమైన వినికిడి శక్తిని కోల్పోయినప్పటికీ, ఆ శూన్యాన్ని అక్షరాలతో, రంగులతో పూరించి తెలుగు చిత్రకళా సాహిత్యానికి ఒక దిశా నిర్దేశం చేసిన ప్రజ్ఞాశాలి ఆయన. చిత్రకారుడిగా, సంపాదకుడిగా, అనువాదకుడిగా, అద్భుతమైన కళా విమర్శకుడిగా ఆయన సాగించిన బహుముఖ ప్రయాణం తెలుగు భాషా సాహిత్య చరిత్రలో ఒక స్వర్ణ అధ్యాయం. తెలుగులో చిత్రకళా రంగంపై ప్రామాణికమైన, విశ్లేషణాత్మకమైన గ్రంథాలు దాదాపు శూన్యంగా ఉన్న కాలంలో ఆ కొరతను తీర్చడానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. కేవలం సృజనకే పరిమితం కాకుండా, కళను సామాన్య మానవుడి మేధస్సుకు చేర్చాలనే తపనతో ఆయన చేసిన కృషి అద్వితీయమైనది.

చలసాని ప్రసాదరావు జన్మవృత్తాంతం, బాల్య నేపథ్యం పరిశీలిస్తే ఆయన విజయాల వెనుక ఉన్న కఠోర శ్రమ, అచంచలమైన ఆత్మవిశ్వాసం స్పష్టమవుతాయి. కృష్ణా జిల్లా మొవ్వ మండలంలోని భట్ల పెనుమర్రు గ్రామంలో 1939 అక్టోబరు 27న ఒక సాధారణ కర్షక కుటుంబంలో ఆయన జన్మించారు. నాటి గ్రామీణ వాతావరణం, ఆర్థిక పరిమితులు ఆయన బాల్యాన్ని చుట్టుముట్టాయి. విద్యాభ్యాసం కోసం ఆయన 1949?50 కాలంలో ఉత్తరాంధ్ర ప్రాంతాలైన విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు వెళ్లాల్సి వచ్చింది. ఆ సమయంలోనే సంభవించిన ఒక తీవ్రమైన అనారోగ్యం ఆయన జీవిత గమనాన్నే మార్చేసింది. ప్రాణాంతకమైన టైఫాయిడ్ వ్యాధి బారిన పడి ఆయన తన వినికిడి శక్తిని పూర్తిగా కోల్పోయారు. సమాజంతో శబ్ద సంబంధం తెగిపోయిన ఆ క్లిష్ట తరుణంలో, నిరాశకు లోనవ్వకుండా జ్ఞాన సముపార్జన వైపు అడుగులు వేశారు. ఈ పరిణామంలో ఆయన మేనమామ వెల్లంకి సుగుణ భూషణరావు పోషించిన పాత్ర చారిత్రాత్మకమైనది. ప్రసాదరావులో పుస్తక పఠనం పట్ల అమితమైన ఆసక్తిని రేకెత్తించి, అక్షరాలనే ఆయనకు ప్రాణాధారంగా మార్చారు. అలా బాహ్య ప్రపంచపు శబ్దాలు మూగబోయినా, పుస్తకాల అంతర్గత శబ్దాలు ఆయనను సరికొత్త ఆలోచనా ప్రపంచంలోకి నడిపించాయి.

జీవితంలో స్థిరపడటానికి, పేదరిక నిర్మూలనకు ఆయన అతి పిన్న వయసులోనే శ్రమజీవిగా మారాల్సి వచ్చింది. 1951 నుండి 1956 వరకు, అంటే తన పన్నెండో ఏట నుంచే 'ప్రజాశక్తి', 'విశాలాంధ్ర' వంటి కమ్యూనిస్ట్ భావజాల పత్రికలలో ల్యాబ్ అసిస్టెంట్‌గా, చిన్న ఉద్యోగిగా పనిచేశారు. ఈ ఐదేళ్ల కాలం ఆయనకు సమకాలీన సామాజిక, రాజకీయ, సాహిత్య ఉద్యమాలపై పట్టు సాధించేలా చేసింది. అనంతరం వరంగల్ నగరానికి వలస వెళ్లి, అక్కడ ప్రసిద్ధ 'కాకతీయ' వారపత్రికలో అసోసియేట్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈ సంపాదకీయ అనుభవం ఆయనలోని రచనా నైపుణ్యాన్ని, వార్తల విశ్లేషణా సామర్థ్యాన్ని పదును పెట్టింది. అయితే, కేవలం అక్షరాలకే పరిమితం కాకుండా తన అంతరంగంలోని దృశ్య రూపాలకు ప్రాణం పోయాలనే బలమైన ఆకాంక్షతో ఆయన హైదరాబాద్ చేరారు. అక్కడ ప్రభుత్వ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో ప్రవేశం పొంది, కమర్షియల్ ఆర్ట్‌లో ఐదేళ్ల సుదీర్ఘ డిప్లొమా కోర్సును విజయవంతంగా పూర్తి చేశారు. చిత్రకళలో ఆధునిక పోకడలను శాస్త్రీయంగా అభ్యసించడంతో పాటు, లండన్‌కు చెందిన ప్రతిష్టాత్మక 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫోటో టెక్నాలజీ' నుండి అదనపు డిప్లొమా సాధించడం ఆయన విద్యా విషయక నిబద్ధతకు నిదర్శనం. సమాంతరంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి బి.ఏ. పట్టా పుచ్చుకుని, అటు అక్షరానికి ఇటు రంగుకు మధ్య ఒక అద్భుతమైన సమన్వయాన్ని సాధించారు.

విద్యార్హతలు పూర్తి కాగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధాల శాఖలో స్టాఫ్ ఆర్టిస్టుగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలకు రూపకల్పన చేయడం, దృశ్య మాధ్యమాల ద్వారా ప్రజలకు సమాచారాన్ని చేరవేయడంలో ఆయన తన విశేష నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఆ కాలంలో భారతీయ చిత్రకళా రంగంలో ఎం.ఎఫ్. హుస్సేన్, సతీష్ గుజ్రాల్, పిటి రెడ్డి వంటి ఆధునిక చిత్రకారులు సరికొత్త ప్రయోగాలు చేస్తున్నారు. కానీ తెలుగు సమాజంలో ఆ పరిణామాలను విశ్లేషించే, సామాన్యులకు అర్థమయ్యేలా వివరించే సాహిత్య వనరులు మృగ్యంగా ఉన్నాయి. ఈ శూన్యాన్ని గమనించిన ప్రసాదరావు, తెలుగులో 'కళా విమర్శ' అనే ఒక నూతన ప్రక్రియకు పునాది వేయాలని సంకల్పించారు. 1971లో 'వసుధ' పత్రికకు సంపాదకత్వం వహించడం ద్వారా సాహిత్య, సామాజిక అంశాలపై గంభీరమైన చర్చలను లేవనెత్తారు. ఆయన ప్రతిభను, నిశిత పరిశీలనా శైలిని గుర్తించిన రామోజీరావు నేతృత్వంలోని 'ఈనాడు' యాజమాన్యం 1974లో ఆయనను ఆదివారం అనుబంధానికి పార్ట్-టైమ్ ఎడిటర్‌గా ఆహ్వానించింది. ఆపై 1975లో ఆయన సామర్థ్యానికి పూర్తి స్థాయి గుర్తింపుగా 'ఈనాడు' ఆదివారం సంచిక బాధ్యతలను అప్పగించింది. ఆ తర్వాత కాలంలో 'విపుల', 'చతుర' వంటి విశిష్ట కథా, నవలల మాసపత్రికలకు సంపాదకుడిగా వ్యవహరించి, తెలుగు పత్రికా రంగంలో పేజీల రూపకల్పన, కంటెంట్ సెలెక్షన్‌లో సరికొత్త ప్రమాణాలను నెలకొల్పారు.



**జూన్ 12... చలసాని ప్రసాద్ రావు వర్ధంతి**

చలసాని ప్రసాదరావు సాహిత్య జీవితంలో ఒక అద్భుతమైన మలుపు, తెలుగు పాఠకులకు నిరంతర వైజ్ఞానిక విందుగా మారిన శీర్షిక 'కబుర్లు'. ఈనాడు దినపత్రికలో ఈ శీర్షికను ఆయన వెయ్యి వారాలకు పైగా నిరాఘాటంగా నిర్వహించి ఒక అరుదైన రికార్డును సృష్టించారు. పత్రికా రంగంలో ఒకే శీర్షిక అంత సుదీర్ఘకాలం పాటు, ఏమాత్రం జిగి, బిగి తగ్గకుండా, పాఠకుల్లో ఆసక్తిని సడలనివ్వకుండా సాగడం ఒక అసాధారణమైన ప్రక్రియ. అసలు ఈ 'కబుర్లు' శీర్షిక వెనుక ఒక పెద్ద చరిత్రే ఉంది. ప్రసాదరావు ఈ శీర్షికను మొట్టమొదటగా 1971లో తాను సంపాదకత్వం వహించిన 'వసుధ' అనే మాసపత్రికలో ప్రారంభించారు. నాటి సాహిత్య సమాజంలో ఈ ప్రయోగం ఒక కొత్త వెలుగును నింపింది. ఆ తర్వాత ఈ శీర్షిక ప్రస్థానం 'జ్యోతి' అనే మరో ప్రసిద్ధ మాసపత్రికలో కొంతకాలం పాటు విజయవంతంగా కొనసాగింది. అయితే, ఈ కబుర్లకు ఒక శాశ్వతమైన చిరునామా, విశాలమైన పాఠక లోకం లభించింది మాత్రం ఈనాడు దినపత్రికలోనే. 1982 అక్టోబరు 22వ తేదీన ఈనాడు దినపత్రికలో 'కబుర్లు' శీర్షిక అధికారికంగా అడుగుపెట్టింది. నాటి నుండి ఆయన జీవితాంతం వరకు, అంటే దాదాపు రెండు దశాబ్దాల పాటు ఈనాడు వేదికగానే ఆయన పాఠకులతో నిరంతరం కబుర్లాడారు. సమకాలీన సామాజిక వైరుధ్యాలను, రాజకీయ విపరిణామాలను, మానవ స్వభావాలలోని లోటుపాట్లను ఎండగట్టడానికి ఆయన ఈ శీర్షికను ఒక శక్తి వంతమైన ఆయుధంగా మలచుకున్నారు.

ఈ శీర్షిక అంతర్లీన ఉద్దేశాన్ని, తన రచనా తత్వాన్ని చలసాని ప్రసాదరావు స్వయంగా తన మాటల్లోనే ఎంతో స్పష్టంగా వివరించారు. "కబుర్లు రచయితగా నా లక్ష్యం పాఠకుల్ని కాసేపు నవ్వించే హాస్యగాడుగా ఉండిపోవడం కాదు. ఒక అంశం గురించి నేను ఫీలయినదాన్ని నా పాఠకులు కూడా ఫీలయ్యేలా నా రచన కొనసాగాలనేది నా లక్ష్యం. అందుకే కబుర్లలో హాస్యం పాలుకంటే వ్యంగ్యం పాలు ఎక్కువ" అని ఆయన పేర్కొన్నారు. ఈ మాటలను బట్టి ప్రసాదరావు సామాజిక స్పృహ, బాధ్యతాయుతమైన రచనా శైలి ఎంతటి ఉన్నతమైనవో అర్థం చేసుకోవచ్చు. ఆయన కేవలం చదువరులకు క్షణికమైన వినోదాన్ని పంచాలని ఆశించలేదు; సమాజంలో జరుగుతున్న పరిణామాలపై పాఠకుడు ఆలోచించేలా, అంతర్మథనం చెందేలా చేయడమే తన పరమావధిగా పెట్టుకున్నారు. హాస్యాన్ని ఒక పైపూతగా వాడుకుంటూనే, సమాజంలోని కుళ్లును కడిగిపారేసే వ్యంగ్య బాణాలను ఆయన సంధించారు. ప్రతి వారం వచ్చే ఈ కబుర్ల కోసం నాటి అక్షరాస్యులు, మేధావులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూసేవారంటే ఆ రచనలో ఉన్న సామాజిక బలం, భాషా పటిమ ఎలాంటివో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. క్లిష్టమైన విషయాలను సైతం దైనందిన జీవితంలో మాట్లాడే కబుర్ల రూపంలోక మార్చి, ఆ వచనానికి ఒక సాహిత్య గౌరవాన్ని తీసుకువచ్చిన ఘనత చలసాని ప్రసాదరావు గారిది.

చలసాని ప్రసాదరావు సాహిత్య సేవలో అత్యంత అగ్రభాగం ఆక్రమించేది ప్రపంచ చిత్రకళను తెలుగు వారికి పరిచయం చేయడం. పాశ్చాత్య దేశాలలో సంభవించిన పునరుజ్జీవన యుగం నాటి లియోనార్డో డా వించి, మైఖేలాంజెలో లార్డ్స్ నుండి ఆధునిక యుగపు పికాసో, వాన్‌గోగ్, సాల్వడార్ డాలీ వరకు గల ప్రపంచ ప్రసిద్ధ చిత్రకారుల జీవితాలను, వారి కళా సిద్ధాంతాలను అత్యంత సరళమైన శైలిలో తెలుగులోకి అనువదించి, విశ్లేషించారు. క్యూబిజం, ఇంప్రెషనిజం, సర్రియలిజం వంటి జటిలమైన ఆధునిక కళా ఉద్యమాలను సామాన్య పాఠకుడికి సైతం ఆకట్టుకునేలా వివరించడం ఆయనకే చెల్లింది. భరతుని నాట్యశాస్త్రం, భారతీయ శిల్పకళా రహస్యాలు, అజంతా, ఎల్లోరా గుహల వైభవం, లేపాక్షి శైలి వంటి ప్రాచీన సంప్రదాయాలను వివరిస్తూనే, జానపద కళారూపాలలోని సౌందర్యాన్ని ఆయన తన వ్యాసాల ద్వారా ఆవిష్కరించారు. కళ అనేది కొద్దిమంది మేధావుల డ్రాయింగ్ రూములకు లేదా గ్యాలరీలకు పరిమితం కాకూడదని, అది ప్రజా బాహుళ్యంలోకి వెళ్లినప్పుడే సార్థకత చేకూరుతుందని ఆయన బలంగా విశ్వసించారు. ఇందుకోసం ఆయన రాసిన వందలాది వ్యాసాలు, గ్రంథాలు నేటికీ లలితకళల అకాడమీలలో, విశ్వవిద్యాలయాలలో ప్రామాణిక పాఠ్యగ్రంథాలుగా చలామణి అవుతున్నాయి.

చిత్రకారుడిగా ఆయన శైలి అత్యంత విలక్షణమైనది. రేఖల సరళత, రంగుల సమపాళ్ల కలయిక, భావవ్యక్తీకరణలో నిగూఢత ఆయన చిత్రాల ప్రత్యేకత. ఆయన వేసిన అనేక చిత్రాలు సామాజిక స్పృహను, మానవీయ విలువలను ప్రతిబింబించేవిగా ఉండేవి. ఒకవైపు పత్రికా సంపాదకుడిగా తీరిక లేని బాధ్యతలు నిర్వర్తిస్తూనే, మరోవైపు రంగుల ప్రపంచంలో పరిశోధనలు సాగించడం, ఇంకోవైపు గ్రంథ రచన చేయడం, వీటన్నింటికీ మించి ప్రతి వారం జిగి సడలని 'కబుర్లు' అల్లడం వంటివి ఆయనలోని అసాధారణ కార్యదక్షతకు నిదర్శనాలు. శారీరక లోపాలు మానసిక వికాసానికి ఏమాత్రం అడ్డుకావని, దృఢ సంకల్పం ఉంటే ఇంద్రియ పరిమితులను అధిగమించి విశ్వవ్యాప్తమైన ముద్ర వేయవచ్చని ఆయన తన 63 ఏళ్ల జీవిత ప్రయాణంలో అక్షరాలా నిరూపించారు. యువ చిత్రకారులను, జర్నలిస్టులను ప్రోత్సహించడంలో, వారికి అంతర్జాతీయ కళా పోకడలను వివరించడంలో ఆయన ఎల్లప్పుడూ ఒక దిక్సూచిలా నిలిచారు.

2002 జూన్ 12న చలసాని ప్రసాదరావు భౌతికంగా ఈ లోకాన్ని విడిచి వెళ్లినప్పటికీ, ఆయన సృష్టించిన వైజ్ఞానిక, కళా సంపద తెలుగు నేలపై చిరస్థాయిగా నిలిచి పోయింది. తెలుగు పత్రికా రంగంలో ఆదివారం సంచికల ప్రాభవాన్ని పెంచిన సంపాదకుడిగా, నిరంతరాయంగా సాగిన 'కబుర్లు' శీర్షిక ద్వారా వ్యంగ్య వచన సాహిత్యానికి నూతన సొగసులు అద్దిన దార్శనికుడిగా, తెలుగులో చిత్రకళా సాహిత్యానికి ఆద్యుడిగా ఆయన చేసిన సేవలు అజరామరం. అక్షరానికి రంగును అద్ది, రంగుకు భావాన్ని ఇచ్చి, మూగబోయిన లోకంలో ఉండి కూడా తెలుగు సాహిత్య భాండాగారాన్ని తన మేధోశక్తితో నింపిన చలసాని ప్రసాదరావు జీవితం, కృషి రాబోయే తరాలకు నిరంతర స్ఫూర్తిదాయకం.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

# పారదర్శక దర్యాప్తుతో నిందితులకు శిక్ష పడేలా చర్యలు

**– జిల్లా ఎస్పీ మహేష్ బి గితే**



రాజన్న సిరిసిల్ల, జూన్ 11: (నేటినిజం ప్రతినిధి): జిల్లాలో నమోదయ్యే ప్రతి కేసులో పారదర్శకంగా, నిష్పాక్షికంగా దర్యాప్తు నిర్వహించి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పోలీసు అధికారులను ఆదేశించారు. వేములవాడ సబ్-డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎస్పీ పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తు పురోగతి, నాన్- బెయిలబుల్ వారెంట్ల అమలు, పోలీసు సిబ్బంది పనితీరు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పాత కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను గుర్తించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో అవసరమైతే న్యాయ సలహాలు తీసుకుని దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. నాన్- బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రతిరోజూ పర్యవేక్షణ నిర్వహించాలని, నిందితుల అరెస్టుల్లో నిర్లక్ష్యానికి తావివ్వవద్దని స్పష్టం చేశారు. పోలీసుల ప్రవర్తనే శాఖ ప్రతిష్ఠను నిర్ణయిస్తుందని పేర్కొన్న ఎస్పీ, విధుల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి సీఐ, ఎస్ఐ తమ పరిధిలో స్థానిక ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేసి ముందస్తు సమాచార సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ పోలీసు శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా పనిచేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీఎస్పీలు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, మధుకర్, ఎస్ఐలు కిరణ్ కుమార్, రమా కాంత్, రమేష్, రామ్మోహన్, ప్రేమనందం, మోతిరాం తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండ ఎన్జీ కళాశాల డిగ్రీ పలు సెమిస్టర్ ఫలితాలు విడుదల

నల్గొండ, జూన్ 11: నల్లగొండ నాగార్జున ప్రభుత్వ కళాశాల డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను గురువారం ఆ కళాశాలలోని పరీక్షల విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంజీయూ సిఓఈ డాక్టర్ జి.ఉపేందర్ రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 4వ, 6వ సెమిస్టర్స్ రెగ్యులర్ 1, 2, 3, 5వ సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరీక్షల ఫలితాలను విడుదల చేసి కళాశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీఓఈ డాక్టర్ మునిస్వామి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వరంగి రవికుమార్, అకడమిక్ కోఆర్డినేటర్స్ బత్తిని నాగరాజు, మేరెడ్డి శ్రీనివాసరెడ్డి, పరీక్షల విభాగం అసిస్టెంట్ కంట్రోలర్స్ ఎన్.కోటయ్య, ఎస్.వాసుదేవ్, ఎన్.వేణు, డాక్టర్ బొజ్జ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# 32 మంది సాంఘిక కార్యకర్తలకు సేవా రత్న పురస్కారం



హైదరాబాద్, జూన్ 11:తెలంగాణ రాష్ట్ర అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో, నాంపల్లిలోని గాంధీ భవన్‌లోని ప్రకాశన్ హాల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో 132 మంది సాంఘిక కార్యకర్తలకు సేవా రత్న పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక కార్యకర్తలు, మానవ హక్కుల పరిరక్షకులు, వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు పాల్గొన్నారు. డాక్టర్ రాజేంద్ర సింగ్ థక్రాల్ మార్గదర్శకత్వం మరియు అధ్యక్షతన ఈ కార్యక్రమం ప్రారంభమైంది.

ఎఊఖీఖ అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఎ. రెహమాన్ ఫహీమ్ వార్షిక నివేదికను సమర్పించారు. సన్మాన కార్యక్రమంలో, ముఖ్య అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ ఐఎఎస్ సయ్యద్ అజ్మత్ ఉల్లా జస్టిస్ పాషా నవాజ్ ఖాన్, జాతీయ అధ్యక్షులు డా. హెచ్. మహమ్మద్ ముజాహిద్, అడ్వకేట్ నేషనల్ చైర్మన్ డా. షేక్ ఫరాష్ షోయబ్ రెహమాన్, గురు నానక్ మిషన్ ట్రస్ట్ కు చెందిన సర్దార్ రణవీర్ సింగ్ గాంధీ, హెచ్ఆర్‌పిసి సౌత్ ఇండియా అధ్యక్షులు డా. రాజేంద్ర సింగ్ థక్రాల్ చేతుల మీదుగా సాంఘిక కార్యకర్తలను సత్కరించారు. ఐహెచ్ఆర్‌పిసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. అబ్దుల్ రెహమాన్ ఫహీం చేసిన సేవలను ప్రశంసించారు.

విచ్చేసిన అతిథులందరికీ శ్రీ ఫహీం కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళా సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ

**–బావుసాయిపేటలో రూ.10 లక్షలతో నిర్మాణ పనులకు శ్రీకారం**
**– గ్రామ సర్పంచ్ షేక్ యాస్మీన్ ఫిరోజ్ పాషా**



రాజన్న సిరిసిల్ల, జూన్ 11: (నేటినిజం ప్రతినిధి): బావుసాయిపేట గ్రామంలో మహిళా చైతన్య సమైక్య మహిళా సంఘ భవన నిర్మాణానికి గురువారం భూమి పూజ నిర్వహించారు.

ఈ భవనం నిర్మాణం కోసం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంజూరు చేసిన రూ.10 లక్షల నిధులతో పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ షేక్ యాస్మీన్ ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. మహిళల అభివృద్ధి, సాధికారత, సంక్షేమానికి ఈ భవనం ఉపయోగపడుతుందని సర్పంచ్ తెలిపారు. గ్రామ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తూ ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గ్రామ మహిళల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం పద్మయ్య, ఏపీఎం రాజేశం, ఉపసర్పంచ్ నవీన్, వార్డు సభ్యులు ఊరడి రమేష్, సునీత, అరె సుజాత, సీసీ జనార్దన్, వీవోఏలు తిక్కల బాబు, పుల్లూరి రాజేశం, వీవోలు జంగం సోనియ, భూతగడ్డ గీత, గొల్లపెల్లి హారిక, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నాంపల్లిలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ ఎక్స్‌రే శిబిరం



రాజన్న సిరిసిల్ల, జూన్ 11: (నేటినిజం ప్రతినిధి): ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం వేములవాడ మండలం నాంపల్లి గ్రామంలో ప్రత్యేక ఎక్స్‌రే శిబిరం నిర్వహించారు.

జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా వైద్యా ధికారి డాక్టర్ రజిత ఆదేశాల మేరకు డాక్టర్ దివ్యశ్రీ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని హైరిస్క్ వర్గాలకు చెందిన 72 మందికి ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు.

టీబీ వ్యాధిని ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు చేపట్టడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. గ్రామస్థులు పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాంపల్లి కౌన్సిలర్ లావణ్య శ్రీనివాస్, కాశ శ్రీనివాస్, టీబీ సూపర్వైజర్లు మహిపాల్, గంగాధర్ (ఎస్‌టీఎస్), ఎక్స్‌రే టెక్నీషియన్ బాలు, టీబీ నోడల్ హెచ్ఎస్ పి.రాజయ్య, హెచ్ఏ శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ ఐశ్వర్య, ఏఎన్ఎంలు సరస్వతి, సుజాత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆహ్వానం

శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య
మరియు
ప్రపంచ రికార్డులలో స్థానం పొందిన ఆడిటోరియం
శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో
శ్రీ కళా సుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్.
తేది : 19-06-2026, శుక్రవారం, సమయం : సా॥ 6.00 గంటలకు



" శ్రీమతి ఏకాపద్మ స్మారక పురస్కార ప్రధానోత్సవ సభ "

| | | |
|---|---|---|
| ముఖ్య అతిథి | : | లయన్ డా॥ వై. ఎమ్. ధర్, లయన్స్ క్లబ్, మాజీ గవర్నర్ |
| సభాధ్యక్షులు | : | శ్రీ పి. పవన్ కుమార్, ప్రముఖ పారిశ్రామిక వేత్త |
| విశిష్ట అతిథి | : | శ్రీ కళా జనార్ధన మూర్తి, అధ్యక్షులు - శ్రీ త్యాగరాయ గానసభ |
| గౌరవ అతిథి | : | శ్రీ బైస దేవదాసు, సంపాదకులు, నేటి నిజం |
| పురస్కార గ్రహీత | : | శ్రీమతి డా॥ పి. భవాని, కన్సల్టింగ్ హోమియో ఫిజిషియన్ |
| ప్రత్యేక ఆహ్వానితులు | : | శ్రీమతి కె. కామేశ్వరి, ట్యాక్స్ కన్సల్టెంట్ |
| ఆత్మీయ అతిథి | : | శ్రీమతి పాతూరి జయలక్ష్మి, మేనేజర్ సాహితీ కిరణం |
| పురస్కార ప్రదాత | : | శ్రీ ఏకా నాగరాజు రామమోహన్ రావు, ప్రొప్రైటర్, పద్మ ఆప్టికల్స్ |
| వందన సమర్పణ | : | శ్రీమతి ఏకా వేంకట ధర్మ సంవర్ధని |



లంకా వెంకట సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు, శ్రీమతి భాను, కార్యదర్శి
శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య
ప్లాట్ నెం. 308, శ్రీ మణికంఠ అపార్టుమెంట్స్, కళ్యాణ్ నగర్, ఈస్ట్ ఆనంద్‌బాగ్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్ - 500 047. సెల్ : 94404 48650.



Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.